సంపుటి : 9
సంచిక : 332
సోమవారం
24 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వ వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

వందేమాతరం అంటే

## హిందూ దేవతల పూజ కాదు

యోగా గురు బాబా రాందేవ్



**హరిద్వార్, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** 'వందేమాతరం' గీతం పూర్తి రూపంలో ఆలపించడంపై వివాదం కొన సాగుతున్న నేపథ్యంలో, యోగా గురు బాబా రాందేవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ గీతంలోని సాహిత్యం హిందూ దేవతలైన దుర్గ, లక్ష్మి వంటి వారిని పూజించడం మిగతా .. 2లో..

విశాఖ వేదికగా

# 'బ్రిక్స్' క్రీడా తీర్మానం

- కీలక ప్రతిపాదనలు చేసిన భారత్
- విశాఖపట్నంలో ముగిసిన బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం
- క్రీడల్లో పరస్పర సహకారానికి సభ్య దేశాల ఉమ్మడి ప్రకటన
- క్రీడా ఉత్పత్తుల తయారీ, సంప్రదాయ క్రీడలపై భారత్ కీలక ప్రతిపాదనలు
- 'మేక్ ఇన్ ఇండియా, ప్లే ఇన్ ఇండియా' నినాదంతో ముందుకు వెళ్లాలన్న కేంద్ర మంత్రి
- భేటీకి ముందు విశాఖలో బ్రిక్స్ ఫ్రెండ్‌షిప్ సైక్లింగ్ ఈవెంట్




**విశాఖపట్నం, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా జరిగిన బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం-2026 విజయవంతంగా ముగిసింది. క్రీడారంగంలో సభ్య దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రూపొందించిన 'బ్రిక్స్ క్రీడా ఉమ్మడి ప్రకటన'కు సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. చర్చలు, పరస్పర గౌరవం, సమ్మిళితత్వంతో ముందుకు సాగాలని దేశాలు పునరుద్ఘాటించాయి. భారత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బ్రిక్స్ సభ్య దేశాల క్రీడా మంత్రులు, సీనియర్ ప్రతినిధులు పాల్గొన్నారు. క్రీడల అభివృద్ధి, భవిష్యత్ సహకారంపై కీలక ప్రాధాన్యతలను చర్చించారు. సమావేశాన్ని ప్రారంభించిన కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, కేవలం ప్రకటనలకే పరిమితం కాని బలమైన బ్రిక్స్ క్రీడా భాగస్వామ్యాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. "అథ్లెట్లు, కోచ్‌ల మార్పిడి, ఉమ్మడి పోటీలు, క్రీడా విజ్ఞానాన్ని పంచుకోవడం వంటి అంశాల్లో వాస్తవ వేదికలను సృష్టించాలి" అని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ తన క్రీడా వ్యవస్థను సమూలంగా మారుస్తోందని, క్షేత్ర స్థాయి నుంచి పతకాల వేదిక వరకు అవకాశాలను సృష్టిస్తోందని మాండవీయ వివరించారు. క్రీడా వస్తువుల తయారీని బలోపేతం చేయడానికి భారత్ చేస్తున్న కృషిని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. "మేక్ ఇన్ ఇండియా, ప్లే ఇన్ ఇండియా, గ్రో విత్ ఇండియా" నినాదంతో ప్రపంచ తయారీదారులు, టెక్నాలజీ కంపెనీలు, మిగతా .. 2లో..

ప్రభుత్వ పాఠశాలలపై

## కూటమిది అబద్ధాల ప్రచారం

మాజీ సీఎం జగన్ తీవ్ర విమర్శలు



**తాడేపల్లి, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యా రంగంపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు భారీగా తగ్గిపోతున్నారని, కూటమి ప్రభుత్వం మాత్రం అబద్ధపు ప్రచారాలు చేసుకుంటోందని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడైస్ ప్లస్ గణాంకాలను ఉటంకిస్తూ సోషల్ మీడియా వేదికగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటు పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని ప్రచారం చేసుకోవడంపై జగన్ మండిపడ్డారు. ఇది వాస్తవమైతే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి కదా? అని ప్రశ్నించారు. కానీ, యూడైస్ గణాంకాల ప్రకారం 2023-24 విద్యా సంవత్సరంతో పోలిస్తే, 2025-26 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 40,50,116 నుంచి 34,93,450కి పడిపోయిందని, అంటే ఏకంగా 5,56,666 మంది విద్యార్థులు తగ్గిపోయారని జగన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45,53,380 నుంచి 48,40,296కు మిగతా .. 2లో..

## ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆందోళన

రంగంలోకి 21 మంది మాజీ కెప్టెన్లు



**ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** పాకిస్థాన్ మాజీ ప్రధాని, ప్రపంచ కప్ విన్నింగ్ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఆయనకు మానవతా దృక్పథంతో మెరుగైన వైద్య సంరక్షణ అందించాలని కోరుతూ ప్రపంచవ్యాప్తంగా 21 మంది మాజీ క్రికెట్ కెప్టెన్లు పాకిస్థాన్ మిగతా .. 2లో..

ఏపీ లిక్కర్ రవాణా కేసులో

## మాజీ మంత్రి కారుమూరి అరెస్టు

వైద్యపరీక్షల నిమిత్తం కారుమూరిని ఆస్పత్రికి తరలిస్తున్న ఈడీ అధికారులు



**హైదరాబాద్, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి, వైకాపా నేత కారుమూరి నాగేశ్వరరావు అరెస్టు అయ్యారు. ఈడీ అధికారులు ఆయనను అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం రవాణా టెండర్లలో అక్రమాలు, నగదు లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అరెస్ట్ అనంతరం మిగతా .. 2లో..

శబరిమలలో తితిదే తరహాలో

## వ్యవస్థ ఉండాలి: పీవీఎన్ మాధవ్

**విద్యాధరపురం, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** శబరిమల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత హిందూ సమాజంపై ఉందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి అయ్యప్ప గురుస్వాముల సమ్మేళనంలో మాధవ్ మాట్లాడుతూ.. శబరిమలలో తితిదే తరహాలో సమర్థమైన వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదం, వసతి, వైద్యం, రవాణా వంటి సౌకర్యాలను సమగ్రంగా



అందించేలా కేంద్రంతో పాటు కేరళ రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో చర్యలు మిగతా .. 2లో..

తారిక్ భారత పర్యటనకు

## తొందరేమీ లేదు


బంగ్లాదేశ్ మంత్రి



**ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రెహమాన్ భారత పర్యటనపై అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆ దేశ విదేశాంగ శాఖ సహాయ మంత్రి హుమయూన్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. శనివారం హుమయూన్ మీడియాతో మాట్లాడుతూ బంగ్లా ప్రధాని తారిక్ భారత పర్యటనకు తొందరపడాల్సిన అవసరం మిగతా .. 2లో..

## ప్రభుత్వంతో చర్చలు సఫలం..

తెలంగాణలో ఆటో, క్యాబ్ సమ్మె విరమణ



**తెలంగాణా, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలో ఈ అర్ధరాత్రి నుంచి తలపెట్టిన ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల నిరవధిక సమ్మె విరమించుకున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జరిపిన చర్చలు ఫలించడంతో యూనియన్లు ఈ నిర్ణయం తీసుకున్నాయి. దీంతో రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా హైదరాబాద్ నగరవాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ వ్యాన్‌లు నిలిపివేయాలని 'కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ' పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే స్పందించి యూనియన్ల మిగతా .. 2లో..

సీనియర్ ఐఏఎస్ ఇంట పెళ్లి సందడి..

## హాజరైన మంత్రి నారా లోకేష్



**హైదరాబాద్, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** సీనియర్ ఐఏఎస్ అధికారి కె. కన్నబాబు కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌లోని వట్టినాగులపల్లిలో ఉన్న ఈవెంతారా కన్వెన్షన్‌లో కన్నబాబు కుమారుడు రితేష్ సూర్య ప్రీతమ్, హిమ ఐశ్వర్యల మిగతా .. 2లో..

629 ఏఈ పోస్టుల భర్తీకి

## సర్వం సిద్ధం

దళారుల మాటలు నమ్మవద్దని నిరుద్యోగులకు సూచన
విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) ఉద్యోగాల భర్తీ పేరుతో నిరుద్యోగులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్రంగా హెచ్చరించారు. రాష్ట్రంలోని మిగతా .. 2లో..




గృహహింస కేసులో

## జోగి రమేష్ కుటుంబానికి ఊరట

11 మంది కుటుంబ సభ్యులకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్
రెండు వారాల్లోగా స్టేషన్‌లో లొంగిపోవాలని కోర్టు ఆదేశం
జోగి రమేష్ సహా ఐదుగురికి ప్రత్యేక షరతులు విధింపు
పాస్‌పోర్టులు స్వాధీనం చేయాలని ఉత్తర్వులు



**విజయవాడ, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ సహా ఆయన కుటుంబ సభ్యులకు గృహహింస కేసులో ఊరట లభించింది. వీరికి షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ విజయవాడలోని మహిళా సెషన్స్ కోర్టు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు వెలువడిన రెండు వారాల్లోగా జోగి రమేశ్‌తో పాటు మొత్తం మిగతా .. 2లో..

బంగాళాఖాతంలో అల్పపీడనం..

## ఉత్తరాంధ్రకు వర్ష సూచన, మత్స్యకారులకు హెచ్చరిక



**ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో నేడు, రేపు పలుచోట్ల మోస్తరు నుంచి ఓ మోస్తరు మిగతా .. 2లో..

## కారుమూరి అరెస్ట్ ప్రభుత్వ కక్షసాధింపు

మాజీ మంత్రి విడదల రజని ఆగ్రహం



**తాడేపల్లి, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును అక్రమంగా అరెస్టు చేశారంటూ ఆ పార్టీ నేత, మాజీ మంత్రి విడదల రజని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని, దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ అరాచకాలకు ఇది పరాకాష్ఠ అని ఆమె ఆరోపించారు. లేని కేసును సృష్టించి వైసీపీ నేతలను ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారని విమర్శిస్తూ తాడేపల్లిలో ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# 'బ్రిక్స్' క్రీడా తీర్మానం

పెట్టుబడిదారులను భారత్‌కు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో భారత్ మూడు కీలక కార్యక్రమాలను ప్రతిపాదించగా, వాటికి సభ్య దేశాల నుంచి విస్తృత మద్దతు లభించింది.

1. వర్కింగ్ గ్రూప్: క్రీడా విజ్ఞానం, అథ్లెట్ల ప్రదర్శన, పాలన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ఆవిష్కరణలలో సహకారాన్ని పెంచేందుకు ఒక వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేయనున్నారు.

2. క్రీడా వస్తువుల తయారీ సదస్సు: క్రీడా వస్తువుల తయారీ, టెక్నాలజీ, వాణిజ్యం వంటి అంశాలపై 2026 నవంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తొలి సదస్సు నిర్వహించాలని ప్రతిపాదించారు.

3. సాంప్రదాయ క్రీడల ప్రదర్శన: బ్రిక్స్ దేశాల సాంప్రదాయ, దేశీయ క్రీడలను ప్రదర్శించేందుకు అక్టోబర్ 12, 13 తేదీల్లో అహ్మదాబాద్‌లో ప్రత్యేక కార్యక్రమం జరపాలని నిర్ణయించారు.

అంతకుముందు, మంత్రులు, ప్రతినిధులు విశాఖలో జరిగిన 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బ్రిక్స్ ఫ్రెండ్‌షిప్ సైక్లింగ్ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలి పట్ల బ్రిక్స్ దేశాల ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబించింది. భారత్ అధ్యక్షతన క్రీడారంగంలో సాధించిన పురోగతిని సభ్య దేశాలు స్వాగతించాయి.

### వందేమాతరం అంటే

# హిందూ దేవతల పూజ కాదు

గురించి కాదని, కేవలం 'భారతమాత'కు చేసే ఆరాధన అని ఆయన ఆదివారం స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాందేవ్ మాట్లాడుతూ.. "మేము భారతమాతనే దుర్గగా, లక్ష్మిగా భావిస్తాం. ఆమే మా విశ్వాసం, మా జ్ఞానం, మా ఆలయం. వందేమాతరంలో దేవతలను, ఆలయాలను చూసేవారు మన సంస్కృతికి దూరమైన వారు. భారతమాత ఆరాధనను దేవతలతో ముడిపెట్టి ఒక మతానికి వ్యతిరేకమని చెప్పడం మేధో దివాళాకోరుతనం" అని అన్నారు. విద్యార్థుల నిరసనల గురించి ప్రస్తావిస్తూ, చిన్న పిల్లలను నిరసనల్లోకి లాగడాన్ని ఆయన తప్పుబట్టారు. "5, 10 ఏళ్ల పిల్లలను కూడా పోలీస్ స్టేషన్లను ముట్టడించాలని, ఎస్పీలు, డీఎంలను ఘెరావ్ చేయాలని ప్రోత్సహిస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. అయితే, 18 ఏళ్లు నిండిన వారు ఎక్కడ అన్యాయం జరిగినా తప్పక పోరాడాలి" అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కుల దూషణలపైనా రాందేవ్ స్పందించారు. "షెడ్యూల్డ్ కులాలు లేదా తెగల వారిని అవమానించడం రాజ్యాంగ విరుద్ధమైనప్పుడు, బ్రాహ్మణులను దూషించడం కూడా ప్రజాస్వామ్యానికి విరుద్ధమే" అని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలు చేసిన ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీని ఆయన ప్రశంసించారు. ఇటీవల తన వ్యక్తిగత జీవితంపై వ్యాఖ్యలు చేయవద్దని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన సూచనపై రాందేవ్ స్పందిస్తూ.. "స్వామి రాందేవ్ ఎవరో, ఆయన సేవ ఏంటో ఈ దేశ ప్రజలకు తెలుసు. అందువల్ల, అలాంటి స్థాయి వ్యక్తుల గురించి నేను ఎలాంటి వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు" అని అన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలపై

# కూటమిది అబద్ధాల ప్రచారం

పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య కూడా 45 వేల నుంచి 44,222కు తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీకి నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ విద్యా సంస్థలతో ఉన్న సంబంధాల కారణంగానే, ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా బలహీనపరుస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. తద్వారా ప్రైవేటు సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం బాటలు వేస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. తమ హయాంలో విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని జగన్ గుర్తుచేశారు. 'మనబడి నాడు-నేడు' కింద రూ.8,524 కోట్లతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని, విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశామని వివరించారు. ఆంగ్ల మాధ్యమాన్ని ప్రోత్సహిస్తూ టోఫెల్ వంటి అంతర్జాతీయ స్థాయి శిక్షణకు సైతం శ్రీకారం చుట్టామని తెలిపారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యారంగం తిరోగమనంలో పయనిస్తుండటం ఆందోళనకరమని జగన్ అన్నారు. ప్రభుత్వ ప్రచారంలోని డొల్లతనాన్ని ఈ లెక్కలే బయటపెడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

### ఏపీ లిక్కర్ రవాణా కేసులో

# మాజీ మంత్రి కారుమూరి అరెస్టు

వైద్యపరీక్షల నిమిత్తం కారుమూరిని ఈడీ అధికారులు ఆస్పత్రికి తరలించారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్టు అయ్యారు. అరెస్టు అయిన వారిలో కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ కుమార్, ఏపీ బేవరేజెస్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, రాజ్‌కెసిరెడ్డి ఉన్నారు. లిక్కర్ రవాణా టెండర్లలో సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్‌ను ఫ్రంట్ కంపెనీగా ఉపయోగించినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఈ కేసులో హవాలా లావాదేవీలపై కూడా దర్యాప్తు ముమ్మరం చేసింది.

### శబరిమలలో తితిదే తరహాలో

# వ్యవస్థ ఉండాలి: పీవీఎన్ మాధవ్

తీసుకోవాలన్నారు. అయ్యప్ప దీక్షల సీజన్‌లో తెలుగు రాష్ట్రాల్లో అదనపు రైళ్లు నడిపేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామన్నారు. తిరుగు ప్రయాణానికి కూడా తగిన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. తితిదే పాలకవర్గ సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. అయ్యప్పల సమస్యలను హిందూ సమాజ సమస్యగా చూడాలన్నారు. నవంబరు 15 నుంచి జనవరి 20 వరకు అయ్యప్ప స్వాములు ఎదుర్కొనే సమస్యలను గురుస్వాములు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో గురుస్వాములు ఆదిమోహనరెడ్డి, వాసు, మధు నంబుది, కోటేశ్వరరావు, శివశంకర్, హనుమంతరావు, భాజపా నాయకులు అడ్డూరి శ్రీరామ్, రమేష్‌నాయుడు, దుర్గగుడి ట్రస్టు బోర్డు సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, రాఘవరాజు పాల్గొన్నారు.

# ప్రభుత్వంతో చర్చలు సఫలం..

నేతలను చర్చలకు ఆహ్వానించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన యూనియన్ల డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించారు. ప్రధానంగా ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ఆయన అంగీకారం తెలిపినట్టు సమాచారం. ప్రభుత్వ హామీతో సంతృప్తి చెందిన యూనియన్ల నేతలు, సమ్మెను విరమించుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించారు. మంత్రితో చర్చలు సఫలం కావడంతో, యథావిధిగా ఆటోలు, క్యాబ్‌లు, ఇతర ప్రైవేట్ వాహనాలు రోడ్డెక్కనున్నాయి. దీంతో ప్రయాణికులకు రవాణా కష్టాలు తప్పినట్టయింది.

### సీనియర్ ఐఏఎస్ ఇంట పెళ్లి సందడి..

# హాజరైన మంత్రి నారా లోకేష్

వివాహ రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు హాజరైన మంత్రి నారా లోకేశ్, వేదికపైకి వెళ్లి నూతన దంపతులను మనసారా ఆశీర్వదించారు. వారికి పుష్పగుచ్ఛం అందించి, ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కన్నబాబు కుటుంబ సభ్యులతో మంత్రి లోకేశ్ కాసేపు ముచ్చటించారు. ఈ వివాహ వేడుకకు పలువురు రాజకీయ, అధికార ప్రముఖులు కూడా హాజరై వధూవరులను ఆశీర్వదించాకరు. మంత్రి నారా లోకేశ్ రాకతో వేడుక ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.

### 629 ఏఈ పోస్టుల భర్తీకి

# సర్వం సిద్ధం

వివిధ విద్యుత్ సంస్థల్లో 629 ఏఈ పోస్టుల భర్తీ కోసం నిర్వహించనున్న పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. అమరావతిలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. ఈ పోస్టుల కోసం లక్ష మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని మంత్రి పేర్కొన్నారు. నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ప్రలోభపెట్టే దళారుల మాటలను ఎవరూ నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎవరైనా డబ్బులు ఆశ చూపి మోసం చేయాలని ప్రయత్నిస్తే, బాధితులు నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాల మేరకు, ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తున్నామని గొట్టిపాటి స్పష్టం చేశారు. ఈ నియామకాల ద్వారా విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు.

### గృహహింస కేసులో

# జోగి రమేష్ కుటుంబానికి ఊరట

11 మంది నిందితులు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోవాలని కోర్టు ఆదేశించింది. ఒక్కొక్కరు రూ. 25 వేల చొప్పున ఇద్దరు వ్యక్తిగత పూచీకత్తులను సమర్పించి బెయిల్ పొందవచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇదే క్రమంలో ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న జోగి రాజీవ్ (ఏ1), జోగి రమేశ్ (ఏ2), శకుంతల (ఏ3), రేష్మా ప్రియాంక (ఏ4), రోహిత్ (ఏ5)లకు న్యాయస్థానం కొన్ని ప్రత్యేక షరతులు విధించింది. కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు ప్రతి శనివారం దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని స్పష్టం చేసింది. అలాగే, తమ పాస్‌పోర్టులను కోర్టుకు అప్పగించాలని, న్యాయస్థానం అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని ఆదేశించింది. దర్యాప్తు ప్రక్రియకు నిందితులు పూర్తిగా సహకరించాలని కోర్టు పేర్కొంది. జోగి రమేశ్ కోడలు మేఘన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు ఆయనతో పాటు మొత్తం 11 మంది కుటుంబ సభ్యులపై హత్యాయత్నం, గృహహింస, వరకట్న నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వారు కోర్టును ఆశ్రయించారు.

# ఉత్తరాంధ్రకు వర్ష సూచన, మత్స్యకారులకు హెచ్చరిక

వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది. సముద్రం అలజడిగా ఉండి, కెరటాలు ఎగసిపడే ప్రమాదం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. ఐఎండీ నివేదిక ప్రకారం, ఆగస్టు 23, ఆదివారం ఉదయం నాటికి ఈ అల్పపీడనం వాయువ్య బంగాళాఖాతంలోనే స్థిరంగా కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. రుతుపవన ద్రోణి కూడా ఈ అల్పపీడన ప్రాంతం మీదుగా కొనసాగుతుండటంతో దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు, అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

# కారుమూరి అరెస్ట్ ప్రభుత్వ కక్షసాధింపు

మద్యం రవాణాలో అక్రమాలు జరిగాయనే నెపంతో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును హైదరాబాద్‌లో అక్రమంగా అరెస్టు చేశారని రజని పేర్కొన్నారు. బీసీ నేత అయిన కారుమూరి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని, కొద్ది రోజుల క్రితం ఆయన కుమారుడు సునీల్‌ను కూడా అరెస్టు చేశారని, ఇప్పుడు ఆయనను అరెస్టు చేయడాన్ని పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇద్దరు రిటైర్డ్ ఉన్నతాధికారులను కూడా అన్యాయంగా జైల్లో పెట్టారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం సరఫరా, విక్రయాలు పారదర్శకంగా జరిగాయని, దుకాణాల సంఖ్య తగ్గించడంతో పాటు అక్రమ మద్యాన్ని పూర్తిగా అరికట్టామని రజని స్పష్టం చేశారు. పర్మిట్ రూమ్‌లు, బెల్టు షాపులను నిర్మూలించామని గుర్తుచేశారు. అయితే, 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో మద్యం సరఫరా, విక్రయాల్లో భారీగా అక్రమాలు జరిగాయని ఆమె ఆరోపించారు. బార్ల యజమానులకు అనుకూలంగా వ్యవహరించి, ప్రివిలేజ్ ఫీజులు మాఫీ చేసి ఖజానాకు నష్టం కలిగించారని విమర్శించారు. అప్పట్లో మద్యం అమ్మకాలు పెరిగినా ప్రభుత్వ ఆదాయం పెరగలేదని, ఆ అవకతవకలపై చంద్రబాబుపై కేసు కూడా నమోదైందని తెలిపారు. ఆ కేసు నుంచి బయటపడటానికే, తమ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలతో కేసులు బనాయించి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని రజని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కారుమూరి నాగేశ్వరరావును తక్షణమే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆందోళన

ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు లేఖ రాశారు. వీరిలో భారత క్రికెట్ దిగ్గజాలు సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్, దిలీప్ వెంగ్‌సర్కార్ కూడా ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది రాజకీయ జోక్యం కాదని, కేవలం క్రీడా స్ఫూర్తితోనే ఈ విజ్ఞప్తి చేస్తున్నామని వారు స్పష్టం చేశారు. గత మూడేళ్లకు పైగా జైలు శిక్ష అనుభవిస్తున్న 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్‌కు ఆయన వ్యక్తిగత వైద్యులతో కూడిన బోర్డుతో వైద్య పరీక్షలు జరిపించాలని పాక్ సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించింది. అయితే, ఆ ఆదేశాలు పూర్తిగా అమలు కాలేదని ఈ లేఖలో మాజీ కెప్టెన్లు ఆరోపించారు. కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా, కేవలం కొన్ని గంటల పాటే ఆసుపత్రిలో ఉంచి ప్రభుత్వ వైద్యులతో పరీక్షలు జరిపి, 'ఆరోగ్యంగానే ఉన్నారు' అని చెప్పి తిరిగి జైలుకు పంపించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇమ్రాన్ కుడి కంటి చూపు మందగించిందని వస్తున్న వార్తలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమ లేఖలో మాజీ కెప్టెన్లు మూడు ప్రధాన డిమాండ్లను ప్రస్తావించారు.

1. సుప్రీంకోర్టు ఆదేశించినట్టుగా, ఇమ్రాన్ వ్యక్తిగత వైద్యులతో కూడిన స్వతంత్ర బోర్డుతో పూర్తిస్థాయి ఆరోగ్య పరీక్షలు జరిపించాలి.
2. వారానికోసారి కుటుంబ సభ్యులతో సమావేశానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా అనుమతించాలి.
3. వైద్య పరీక్షల అనంతరం బోర్డు సూచించిన చికిత్సను తక్షణమే అందించాలి.

ఆరు నెలల క్రితం 14 మంది కెప్టెన్లు ఇలాంటి లేఖ రాయగా, ఇప్పుడు 21 మంది కెప్టెన్లు తమ గళం వినిపించారు. ఆస్ట్రేలియాకు చెందిన అలెన్ బోర్డర్, గ్రెగ్ చాపెల్, స్టీవ్ వా, ఇంగ్లండ్‌కు చెందిన మైఖేల్ అథర్టన్, వెస్టిండీస్ దిగ్గజం సర్ క్లైవ్ లాయిడ్, శ్రీలంక మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ వంటి ప్రముఖులు ఈ లేఖపై సంతకాలు చేశారు. "ఈ సమస్య త్వరగా పరిష్కారమవుతుందని, ఇమ్రాన్ ఖాన్‌కు తగిన గౌరవం దక్కుతుందని ఆశిస్తున్నాం. యువర్స్ ఇన్ క్రికెట్" అంటూ లేఖను ముగించారు.

**సంతకాలు చేసిన మాజీ కెప్టెన్లు వీరే...**

మైకేల్ అథర్టన్, అలెక్స్ బ్లాక్‌వెల్, అలన్ బోర్డర్, మైకేల్ బ్రియర్లీ, గ్రెగ్ చాపెల్, ఇయాన్ చాపెల్, బెలిండా క్లార్క్, అలిస్టర్ కుక్, సునీల్ గవాస్కర్, లీ జెర్మాన్, ఆడమ్ గిల్‌క్రిస్ట్, డేవిడ్ గోవర్, కిమ్ హ్యూస్, నాసిర్ హుస్సేన్, సర్ క్లైవ్ లాయిడ్, కపిల్ దేవ్, అర్జున రణతుంగ, ఆండ్రూ స్ట్రాస్, దిలీప్ వెంగ్‌సర్కార్, స్టీఫెన్ వా, జాన్ రైట్.

# తారిక్ భారత పర్యటనకు తొందరేమీ లేదు

లేదన్నారు. మోదీ ప్రభుత్వంతో సానుకూల సంబంధాలు కొనసాగించాలని తాము కోరుకుంటున్నప్పటికీ.. జాతీయ ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని వ్యాఖ్యానించారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక చర్చలలో తగినంత పురోగతి సాధించిన తర్వాత.. సరైన సమయం చూసుకొని తారిక్ రెహమాన్ భారత పర్యటనకు వెళ్తారని హుమయూన్ పేర్కొన్నారు. ప్రధాని అధికారిక పర్యటనకు తగిన సన్నాహాలు, ఇరుపక్షాల మధ్య అవసరమైన ప్రాథమిక ఏర్పాట్లు అవసరమని తెలిపారు. మరోవైపు ఈ పర్యటనపై బంగ్లా ప్రధాని కార్యాలయం స్పందిస్తూ.. తారిక్ పర్యటనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని పేర్కొంది. మాజీ ప్రధాని షేక్ హసీనాతోపాటు ఇతర నేరస్థులను అప్పగించే విషయంలో భారత్ స్పందన కోసం బంగ్లా వేచి చూస్తున్నట్లు సమాచారం. మరోవైపు సెప్టెంబర్ 12-13 దిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సులో బంగ్లా ప్రధాని పాల్గొనాల్సి ఉండగా.. అంతకుముందే ఆయన దిల్లీ పర్యటనకు వస్తారని వార్తలు వచ్చాయి. బంగ్లా ప్రధానిని స్వాగతించే కార్యక్రమం కోసం రిహార్సల్స్ జరుగుతున్నాయని రాష్ట్రపతి భవన్ నుంచి ఇటీవల ప్రకటన వెలువడినప్పటికీ.. గంటల వ్యవధిలోనే దానిని ఉపసంహరించుకోవడం గమనార్హం.

**మక్కా ఒప్పందంలోకి బంగ్లాదేశ్..?**

పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కియే దేశాలు కుదుర్చుకున్న 'మక్కా సమష్టి రక్షణ ఒప్పందం'లో చేరడానికి బంగ్లాదేశ్ కూడా ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. దేశ ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడుతుందంటే ఆ ఒప్పందంలో చేరే అంశాన్ని ఢాకా పరిశీలిస్తోందని విదేశాంగ శాఖ సహాయ మంత్రి హుమయూన్ వ్యాఖ్యానించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పాక్, సౌదీ, తుర్కియేతో చేతులు కలపడానికి తాము సానుకూలంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు ప్రధాని తారిక్ త్వరలో రియాద్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు. దీంతో బంగ్లా సైతం మక్కా ఒప్పందంలో చేరే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

# బాహుబలి జేసీబీతో గచ్చిబౌలిలో ప్రమాదకర భవనం కూల్చివేసిన హైడ్రా

**నిన్న కూలిన భవనం పక్కనే దెబ్బతిన్న మరో నిర్మాణం – సీఎంసీ, హైడ్రా ఆధ్వర్యంలో సంయుక్త ఆపరేషన్**

**ముందుజాగ్రత్తగా సమీప అపార్ట్‌మెంట్ వాసుల తరలింపు – అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించిన అధికారులు**



**గచ్చిబౌలి, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ఆంజనేయ నగర్‌లో శనివారం ఓ ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన నేపథ్యంలో, దాని పక్కనే ప్రమాదకరంగా మారిన మరో బహుళ అంతస్తుల భవనాన్ని అధికారులు కూల్చివేశారు. సీఎంసీ (సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్), హైడ్రా బృందాలు సంయుక్తంగా ఆదివారం ఉదయం ఈ ఆపరేషన్ చేపట్టాయి. శనివారం సాజిద్ అనే వ్యక్తికి చెందిన భవనం కూలిపోవడంతో, దాని శిథిలాలు పక్కనే ఉన్న మరో ఏడంతస్తుల భవనంపై పడ్డాయి. దీంతో ఆ భవనం కూడా తీవ్రంగా దెబ్బతిని, ఏ క్షణమైనా కూలిపోయే స్థితికి చేరింది. ఈ నిర్మాణం వల్ల చుట్టుపక్కల భవనాలకు, ప్రజలకు పెను ప్రమాదం పొంచి ఉందని సీఎంసీ అధికారులు నిర్ధారించారు. వారి అభ్యర్థన మేరకు హైడ్రా బృందాలు రంగంలోకి దిగి కూల్చివేత పనులను ప్రారంభించాయి. ఈ భవనాలు అత్యంత సమీపంలో, ఎలాంటి ఖాళీ స్థలం లేకుండా నిర్మించడంతో కూల్చివేత సవాలుగా మారింది. 'బాహుబలి' జేసీబీ వంటి భారీ యంత్రాలను ఉపయోగిస్తూ, సమీపంలోని ఇతర నిర్మాణాలకు ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కూల్చివేత నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని స్టెర్లింగ్ వైట్‌ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌లోని నివాసితులను ఇళ్లు ఖాళీ చేయించారు. ఆ ప్రాంతంలోకి ప్రజలు రాకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆంజనేయ నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం 50 గజాల స్థలంలోనే ఏడంతస్తుల వరకు పేకమేడల్లా భవనాలు నిర్మించారని అధికారులు తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించడంతో కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఈ ఘటనతో అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నట్లు స్పష్టమవుతోంది.

# ఎడిటర్ వాయిస్

## 'ఎన్టీఆర్' ఇమేజ్ పోగొట్టుకున్న వైసీపీ..!

టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ఎన్టీఆర్ పేరును వినియోగించుకునే విషయంలో వైసీపీ గత పాలనలో ముందున్న విషయం తెలిసిందే. ఏకంగా కృష్ణా జిల్లాను విడదీసి.. ఎన్టీఆర్ పేరు పెట్టారు. దీంతో ఒక జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టిన ఘనత తమ దేనని ప్రకటించుకున్నారు. తర్వాత.. ఆయన పేరుతో పాలిటిక్స్ చేయాలని అనుకున్నారు. ఎన్టీఆర్ సామాజిక వర్గాన్ని ఆకర్షించే ప్రయత్నం చేశారు. కానీ, ఇదే సమయంలో హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరు తీసేయడం.. వచ్చిన ఇమేజ్‌ను పోగొట్టిందన్న వాదన ఉంది.

కట్ చేస్తే.. ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ పాలిటిక్స్ ఒక అడుగు ముందుకు పది అడుగులు వెనక్కి అన్నచందం గా ఉన్నాయని పరిశీలకులు చెబుతున్నారు. ప్రతి జిల్లాలోనూ వైసీపీ నాయకులు ఉన్నారు. వారిలో ఒకరి ద్దరు జిల్లాలో బలమైన నాయకులుగా ఎదిగారు. ఉదాహరణకు కృష్ణా జిల్లాలో పేర్ని నాని, కొడాలి నాని ఫైర్ బ్రాండ్స్‌గా ఉన్నారు. ఇలా చూసుకుంటే.. ఎన్టీఆర్ జిల్లాలో జోగి రమేష్ కొంత మేరకు ఫైర్ బ్రాండ్‌గా గుర్తింపు కోసం ప్రయత్నించినా.. ఆయన కేసుల్లో చిక్కుకుని బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.

ఇక, మిగిలిన నాయకుల్లో సామినేని ఉదయబాను జనసేనలోకి వెళ్లిపోయారు. నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు ఈ గ్యాప్ ఫిల్ చేయాలని అనుకున్నప్పటికీ.. సాధ్యం కాలేదు. ఇక, విజయవాడలోనూ బలమైన నాయకులు లేకుండా పోయారు. గతంలో మల్లాది విష్ణు ఉన్నా.. ఆయన పరిస్థితి ఇరకాటంలో పడింది. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు అంతర్గత కుమ్ములాటలతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వైసీపీకి బలమైన నాయకులు కరువయ్యారు.

ఇక, కీలకమైన ఎంపీ పోస్టు ఖాళీగానే ఉంది. ఎంపీ అభ్యర్థిని ఇప్పటి వరకు ఎంపిక చేయకపోవడంతో వైసీపీ తరఫున వాయిస్ వినిపించే బలమైన వారు కనిపించడం లేదన్నది వాస్తవం. మరోవైపు కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీలో అంతర్గత పోరు జరుగుతోందని.. అది తమకు లాభిస్తుందని వైసీపీ వేసుకున్న అంచనాలు కూడా తలకిందులు అయ్యాయి. పార్టీ పరంగా తీసుకున్న చర్యలతో తమ్ముళ్లు సర్దుకుపోతున్నారు. దీంతో ఎన్టీఆర్ పేరు పెట్టుకున్నా.. జిల్లాలో వైసీపీ పెద్దగా



పుంజుకోలేక పోవడం.. ఏడు నియోజకవర్గాల్లో నూ కూటమి బలంగా ఉండడం గమనార్హం.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

### ఆడుకునేందుకు స్నేహితుల ఇంటికి వెళ్లి..

## లిఫ్ట్‌లో చిక్కుకుని బాలిక మృతి

**సత్తెనపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో విషాదం చోటుచేసుకుంది. పట్టణంలోని కొత్తపేటలో లిఫ్ట్‌లో ఇరుక్కుని రేవతి (12) అనే బాలిక మృతిచెందింది. ఆడుకునేందుకు స్నేహితుల ఇంటికి వెళ్లగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంటి యజమానులు ఇటీవలే నూతనంగా లిఫ్ట్ ఏర్పాటు చేశారు. బాలిక మృతిపై తల్లిదండ్రుల ఆందోళనకు దిగారు. సత్తెనపల్లి డీఎస్పీ చైతన్య ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. రేవతి మృతిపై విచారణ చేపట్టారు.

## బ్రేకులు ఫెయిలై చెట్టును ఢీకొట్టిన పోలీసు వాహనం.. కానిస్టేబుల్ మృతి



**విజయనగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలీసు వాహనం బోల్తా పడి ఓ కానిస్టేబుల్ మృతిచెందగా.. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. విజయనగరం జిల్లా కొండకరకాం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ కేసు దర్యాప్తు కోసం విజయనగరం రూరల్ పోలీసులు జీపులో ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి కొండకరకాం వెళ్తున్నారు. ఈ క్రమంలో కొండకరకాం ఘాట్ వద్ద బ్రేకులు ఫెయిల్ కావడంతో జీపు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. వాహనంలో ప్రయాణిస్తున్న ఎస్సై అశోక్‌కుమార్, కానిస్టేబుళ్లు నాగేంద్ర, వెంకటరమణ, డ్రైవర్ రాజాబాబుకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వెంకట రమణ (49) మృతిచెందారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు.


**జిల్లా ఎస్పీతో మాట్లాడిన హోంమంత్రి అనిత**

మరోవైపు ఈ ఘటనపై హోంమంత్రి అనిత ఆరా తీశారు. జిల్లా ఎస్పీ దామోదర్‌తో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

## విదేశాలకు రూ.186 కోట్లు బదిలీ.. గుంటూరులో సీఏపై కేసు

**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** విదేశాలకు మోసపూరితంగా నిధులు బదిలీ చేయడంలో కీలక పాత్ర పోషించిన ఛార్టర్డ్ ఎకౌంటెంట్పై గుంటూరు అరండల్‌పేట ఠాణాలో కేసు నమోదైంది. బోగస్ కంపెనీల ద్వారా రూ.186 కోట్ల మేర అక్రమాలకు పాల్పడినట్లు ఆదాయ పన్ను విభాగం అధికారుల పరిశీలనలో తేలింది. అరండల్‌పేటకు చెందిన సీఏ దామా చిన్నవెంకట సుబ్రహ్మణ్యం.. చట్ట ప్రకారం వ్యవహరించకుండా బోగస్ ధ్రువపత్రాలు జారీ చేసి, మోసపూతంగా నిధులు విదేశాలకు బదిలీ చేస్తున్నట్లు ఐటీ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఆదాయ పన్ను విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ సుభాష్.. ఛార్టర్డ్ ఎకౌంటెంట్ కార్యాలయంలో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. షెల్, బోగస్ కంపెనీల పేరుతో సరైన ధ్రువీకరణ లేకుండానే అక్రమాలకు పాల్పడ్డారు. విదేశాలకు నిధులు పంపే సందర్భంలో ఆథరైజ్డ్ డీలర్స్ పాటించాల్సిన మార్గదర్శకాలను పాటించకుండా ధ్రువపత్రాలను జారీ చేసి దళారులకు సహకరించారు. బోగస్ కంపెనీలకు భారీ మొత్తంలో నిధులు బదిలీ చేసినప్పటికీ.. ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేయడం లేదు. లెక్కల పుస్తకాలు, ఒప్పంద పత్రాలు చూడకుండా అక్రమంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో రూ.186 కోట్లు విదేశాలకు పంపే అవకాశం కల్పించారు. దీనిపై ఐటీ విభాగం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది.

## మహిళను చంపి.. బిర్యానీ వండి.. రైల్లో వదిలేసి పరారీ



**చెన్నై, విశ్వం వాయిస్ న్యూస్ :** చెన్నై-దిల్లీ రైలులో ఓ సూట్‌కేస్‌లో మానవ శరీర భాగాలు లభించిన కేసును చెన్నై పోలీసులు ఛేదించారు. మహిళను చంపి శరీర భాగాలతో బిర్యానీ వండినట్లు గుర్తించి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ నెల 5న చెన్నై నుంచి దిల్లీ బయలుదేరిన తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఓ జనరల్ కంపార్ట్‌మెంట్‌లో తీవ్ర దుర్వాసన వస్తుండడంతో ప్రయాణికులు అక్కడి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. వారు బోగీలో తనిఖీ చేసి అనుమానాస్పదంగా కనిపించిన ఎరుపు రంగు సూట్‌కేస్‌ని స్వాధీనం చేసుకుని తెరచి చూశారు. అందులో మానవ శరీర భాగాలు ఉండడం చూసి షాకయ్యారు. దర్యాప్తు జరపగా సూట్‌కేస్ చెన్నై నుంచి వచ్చినట్లు తెలిసింది. అనంతరం ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు తమిళనాడు రైల్వే పోలీసులను సంప్రదించారు. వారు చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్, చుట్టుపక్కల ప్రాంతాల్లోని 350కి పైగా సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఎరుపురంగు సూట్‌కేస్‌తో వచ్చిన ఓ పురుషుడు, మహిళ తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైల్లో సూట్‌కేస్‌ను పెట్టి దిగేసి, తర్వాత సబర్బన్ రైలెక్కి గూడువాంజేరి చేరుకున్నట్లు గుర్తించారు. అనంతరం వారి ఇంటిని గుర్తించగా.. అందులో ఒడిశాకు చెందిన మాణిక్ ఉత్తిన్ లస్కర్, అతని భార్య భాగమతి మాజిక్ ఉంటున్నారని, వారితో పాటు హయాత్ నిషా అనే మహిళ ఉంటున్నట్లు తెలిసింది. హత్యకు గురైంది నిషాగా గుర్తించారు.

**ఇల్లంతా రక్తపు మరకలు**

ఒడిశాకు చెందిన హయాత్ నిషా భర్తతో విడిపోయిందని, ఆమె 19 ఏళ్ల కుమారుడు ఏసీ మెకానిక్‌గా చెన్నై తాంబరంలో పనిచేస్తున్నట్లు తెలిసింది. హయాత్ నిషా మాత్రమే మాణిక్ ఉత్తిన్ లస్కర్ దంపతులతో కలిసి ఉంటోందని, వారు ఆమెను హత్య చేసి ముక్కలుగా నరికి సూట్‌కేస్‌లో పెట్టి తీసుకెళ్లినట్లు తేలింది. పోలీసులు మాణిక్ ఉత్తిన్ లస్కర్ ఇంటి తలుపులు పగులగొట్టి లోనికెళ్లి పరిశీలించారు. అక్కడ ఓ బిర్యానీ పాత్ర కనిపించింది. దానిపైన మూతపెట్టి చుట్టూ మైదాపిండి అతికించి ఉంది. మూత తీసి చూడగా రైస్‌తో పాటు మానవ శరీరం ముక్కలు కనిపించడంతో అవాక్కయ్యారు. ఇల్లంతా రక్తపు మరకలు కనిపించాయి. బిర్యానీ పాత్రను స్వాధీనం చేసుకుని చెంగల్పట్టు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హత్యకు గురైన మహిళ తల కోసం పోలీసులు గాలిస్తున్నారు. మాణిక్ ఉత్తిన్ లస్కర్ దంపతులు తనకు తమ్ముడు, మరదలు అవుతారని హయాత్ కొందరికి చెప్పినట్లు పోలీసులు గుర్తించారు.



విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు












సోమవారం, 24 ఆగస్టు, 2026



www.viswamvoice.com
సత్యం • సమగ్రం • సమాజ బద్ధత
www.viswamvoice.com


# హైదరాబాద్‌కు సముద్రం వచ్చినట్టు మండపేటకు పుష్కరాలు తీసుకువచ్చారు

- అన్యాయంగా నిరుపేదల ఇళ్ళు పాకలు కూల్చేశారు
- తెల్లవారుజామునుండే బుల్డోజర్ లతో కూల్చివేత
- భారీగా మోహరించిన పోలీసులు
- అడ్డుకున్న తోట త్రిమూర్తులును వెంకటాయపాలెం తరలించిన పోలీసులు
- రియల్ ఎస్టేట్ కోసం కమీషనర్ బరి తెగింపు



**మండపేట టౌన్, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక చలన చిత్రంలో ఎన్నికల హామీలో భాగంగా హైదరాబాద్ కు సముద్రం తీసుకొస్తాను అన్నట్టు మండపేట పెద్ద కాలువకు పుష్కరాలు తీసుకొచ్చారు . గత 70 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న పేదల ఇళ్లను పుష్కరాల అభివృద్ధి పేరిట అక్రమం గా అన్యాయం గా ఈ కూటమి ప్రభుత్వం కూల్చి వేసిందని రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ధ్వజమెత్తారు. ఇప్పుడు ఇక్కడ ఎంత దౌర్జన్యం తో పేదల గూడు కూల్చారో వీరి శాపం తగిలి కూటమి ప్రభుత్వం కూకటి వేళ్ళతో సహా కుప్ప కూలిపోతుందని పేర్కొన్నారు. మండపేట పెద్ద కాల్వ వద్ద ఉన్న ఆలయాల అభివృద్ధి కి సంబంధించి పుష్కరాల నిధులు విడుదల అయ్యాయి. దీంతో మున్సిపల్ కమీషనర్ టీవీ రంగారావు అక్కడ 70 ఏళ్లు గా గుడిసెలు,పాకలు, పూరిళ్ళు పెంకుటిల్లు పక్కా స్లాబ్ ఇళు ్లు నిర్మించి జీవిస్తున్నారు. వీరికి మూడు సార్లు నోటీసులు ఇచ్చారు. ఖాళీ చేయలేదు. దీంతో ఆదివారం తెల్లవారు జామున ఆ ఇళ్ళు కూల్చివేత ఉత్తర్వులు తో కమీషనర్ టీవీ రంగారావు అక్కడి కి చేరుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కూల్చి వేస్తున్నట్లు చెప్పారు. సమాచారం అందుకున్న రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు,వైసిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని కూల్చివేత అడ్డుకున్నారు. దాదాపు 300 మంది పోలీసులు, డీఎస్పీ లు, సి ఐ లు, ఎస్ ఐ లు, పి సి లు హోం గార్డులు, మహిళా పోలీసులు వైసిపి నాయకులు ను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపధ్యంలో పోలీసులు, వైసిపి నేతలు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ దశలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ను పోలీస్ బస్సు లో ఎక్కించారు. ఆయన స్వగ్రామం వెంకటాయపాలెం ఇంటి వద్ద విడిచిపెట్టి గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా మీడియా తో తోట త్రిమూర్తులు మాట్లాడుతూ ఎవరికి అడ్డు లేని అక్కడి ఇళ్ళు ఈ ప్రభుత్వం దౌర్జన్యం తో తొలగించే యత్నం చేస్తుందన్నారు. పేదల ఇళ్ళు కూల్చిన ఈ ప్రభుత్వం త్వరలో కూలిపోతుందని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాలు పేరిట ఇళ్ళు కూల్చేస్తున్నామని చెబుతున్నారని పుష్కరాలు గోదావరికా మండపేట పెద్ద కాల్వ కా అంటూ ప్రశ్నించారు. మండపేట ఉన్నది కాల్వ గోదారా అని నిలదీశారు. ఈ ఇళ్ళు వారికి ఏమి అడ్డొచ్చాయన్నారు. ఇవి పుష్కరాలకు అడ్డు కాదని, స్తానిక ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు స్థలానికి అడ్డువచ్చాయని ఆరోపించారు. ఈ ఇళ్ళు తీస్తే ఆయన స్థలాన్ని రియల్ ఎస్టేట్ చేసుకోవచ్చని విమర్శలు చేశారు. ఈ క్రమంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ఇక్కడ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ రాజ్యాంగం అయితే ఇటువంటి దౌర్జన్యాలు ఉండవన్నారు. ఇటువంటి దుర్మార్గమైన ఘటన లకు వ్యతిరేకంగా నిలబడి, పేద వారి పక్షాన పోరాటాలు వైసిపి చేస్తుందన్నారు. తమ అధినేత జగన్ ఆధ్వర్యంలో ఈ రాష్ట్రంలో ఇటువంటి దౌర్జన్యాలు జరిగిన ప్రతి చోట తమ పార్టీ పేదల పక్షాన అండ గా ఉంటుందని ఖచ్చితంగా పేదల కోసం తమ పార్టీ పనిచేస్తుందనే దానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇక్కడ తెల్లవారుజామున ఆదివారం తొలగించే అవసరం ఏమొచ్చిందన్నారు. బాధితులు కోర్టు ను ఆశ్రయిస్తారనే ఆలోచన తో ఆదివారం అర్ధరాత్రి ఈ అన్యాయానికి పూనుకున్నారని ధ్వజమెత్తారు. ఈ ఘటన కు మూల్యం చెల్లించాల్సిన పరిస్తితి వస్తుందన్నారు. ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పేదల ఇళ్ళు వెనక ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కు చెందిన 10 ఎకరాల స్థలం ఉందన్నారు. దిన్ని అవుట్ గా అభివృద్ధి చేసి కోట్లు సంపాదించాడని ఈ నిరుపేదల ఇళ్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో రియల్ ఎస్టేట్ అభివృద్ధికి కమీషనర్ టీవీ రంగారావు కొమ్ము కాస్తున్నారని ఆరోపణలు చేశారు. ఇన్ని కబుర్లు చెబుతున్న ఎమ్మెల్యే వేగుళ్ళ ఆయన పార్టీ కి చెందిన వ్యక్తి విలువైన మునిసిపల్ వాటర్ వర్క్స్ స్థలాన్ని ఆక్రమించుకుంటే ఎందుకు ఉపేక్షిస్తున్నారని నిలదీశారు. గతంలో మున్సిపాల్టీ 28 వ వార్డు పరిధిలో 18 ఎకరాలు స్తలం కొనుగోలు చేసిందన్నారు. ఆ స్తలం లో టీడీపీ కి చెందిన నాయకుడు సుమారు రూ 5 కోట్ల విలువ చేసే 40 సెంట్లు అక్రమంగా ఆక్రమించి గోడ కట్టేశారని ఆరోపించారు. దీనిపై పురపాలక కౌన్సిల్ లో పలు సార్లు ఆరోపణలు చేసిన పట్టించుకోలేదని పైగా వారికి కోర్టు కు పంపారని ఆరోపించారు. ప్రభుత్వ స్తలం కబ్జా చేస్తే వారిని ప్రోత్సహిస్తూ నీరు పేదలను రోడ్ పైకి పడేస్తారా అంటూ ప్రశ్నించారు. నిరుపేదల పాకలు అన్యాయం గా కూల్చేశారన్నారు. ఇదే రీతిలో కూటమి ప్రభుత్వం కూలిపోతుందనీ పేర్కొన్నారు.పేదల శాపం తప్పక తగులుతుందనీ చెప్పరు.రియల్ ఎస్టేట్ కోసం కమీషనర్ బరి తెగింపు ను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. తెల్లవారు జామున బుల్డోజర్ తో ఇళ్ళు కూల్చివేత అత్యంత హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండపేట పెద్ద కాల్వ పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మున్సిపల్ సిబ్బంది, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు ఇళ్ల లో సామాగ్రి రోడ్ పై పెడుతున్నారు. మరో వైపు బుల్డోజర్ తో పక్కా ఇల్లు సైతం నెల మట్టం చేశారు. తమ కళ్ళ ముందే తమ గూడు నీడ ను కూల్చేస్తుంటే పేదలు కన్నీరు మున్నీరు అవుతున్నారు. ఈ కార్యక్రమం లో వందలాది మంది వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## "చిరు సేవా సమితి" సేవలు అభినందనీయం



**కడియం, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** కడియం మండలం చిరు సేవా సమితి అధ్యక్షుడు గెడ్డం శివ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కొణిదెల నాగబాబు అన్నారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని చిరు సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం కోకా పేటలో నాగబాబు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వడం ప్రశంస నీయమని పేర్కొన్నారు. మనం అభిమానించే వ్యక్తుల జన్మదినోత్సవాల గుర్తింపుగా మొక్కలు నాటి సంరక్షించాలని అభిమానులకు పిలుపునిచ్చారు. మొక్కలు పెంచడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. కార్యక్రమంలో చిరు సేవా సమితి అధ్యక్షుడు గెడ్డం శివ, ట్రెజరర్ తాళం నరేష్, సభ్యులు పాల్గొన్నారు. అలాగే రూరల్ మండలం లోని బొమ్మూరు శ్రీ వివేకా నంద మహా రోగి ఆరోగ్య కేంద్రం నందు వృద్ధులకు అన్నదానం చేసి, నూతన దుస్తులు అందించారు. స్థానిక బుర్రిలంక ప్రాథమిక పాఠశాల నందు మొక్కలు నాటారు.

## వరలక్ష్మీ దేవి వ్రతం సందర్భంగా మహిళలకు పట్టు చీరల పంపిణీ

**కడియం, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** కడియం మండలం, కడియపులంక గ్రామదేవత శ్రీముసలమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన వరలక్ష్మీ వ్రతం వేడుకలలో, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు జగ్గంపేట నియోజకవర్గం బిఎల్ఎ -1 బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు, పద్మావతి దేవి గంగారత్నం దంపతులు పాల్గొని, సుమారు వెయ్యి మంది మహిళలకు పట్టుచీరలు పంపిణీ చేశారు. అంతకు ముందు కంబాల అమ్మవారికి ఇష్టమైన బెల్లంతో తులాభారం సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి అష్ట మంగళ హారతులు, పవళింపు సేవ కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం భక్తులను



ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో కంబాల దంపతులను ఘనంగా సత్కరించారు. మహిళలకు పట్టుచీరలు పంపిణీ చేసిన అనంతరం స్వల్పహార విందు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో నర్సరీ రైతులు పుల్లా ఆంజనేయులు, పుల్లా పెద సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు మహిళలు పాల్గొని అమ్మవారి ప్రసాదాలు స్వీకరించారు.

## ఆదిత్య ఎన్.ఎస్.ఎస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్ల స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర!






**రాజమహేంద్రవరం, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల, ఆదిత్య మహిళా మరియు పీజీ డిగ్రీ కళాశాల, ఆదిత్య యానిమేషన్ వింగ్, ఆదిత్య మేనేజ్మెంట్ ఆఫ్ కామర్స్, ఆదిత్య బిజినెస్ స్కూల్ కు చెందిన ఎన్ఎస్ఎస్ మరియు యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు 52 మంది నేడు ఆదివారం అనగా 23-8-26 ఉదయం 7 గంటల నుండి 9:30 వరకు లిస్వచ్ఛభారత్ కార్యక్రమం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రెడ్డి బాబు మోటార్స్ కు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో డైరెక్టర్ ఎస్పి గంగిరెడ్డి మరియు ప్రిన్సిపాల్ పి.లక్ష్మీ సరోజ సారధ్యంలో ఆదిత్య ఎన్ ఎస్ ఎస్ మరియు ఇండియన్ యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.వి.ఎస్.నాగేశ్వరరావు ప్రేరణతో పరిశుభ్రం చేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో వ్యర్థ పదార్థాలను, ఏడడుగుల పనికిరాని మొక్కలను తొలగించి, ప్లాస్టిక్ ను ఏరివేసి ఈ కార్యక్రమం విజయవంతంగా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఫ్.ఎస్. ఎస్ కు చెందిన ధర్మ, ఆర్ట్ ఆఫ్ లివింగ్, భారతీయ వికాస్ పరిషత్ కు చెందిన పి. వి. ఎస్. కృష్ణారావు ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ జిల్లా డిస్ట్రిక్ట్ బ్రాంచి కి చెందిన కోశాధికారి డాక్టర్ జి.ఎన్. వి. ఎ. బి. ఎస్.మహాలక్ష్మి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మరియు ఇండియన్ యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి హెచ్ వి రమాదేవి, పోలుకొండ సాయి, బి. విమల, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ బి కిరణ్ కుమార్ , నాయకులు జాహ్నవి, సమీర, గౌతమ్, రామ్, టా గూర్, రషీద్, పోసి పృథ్వి తదితరులు పాల్గొన్నారు.


మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!
నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!
- బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel
మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి
JOIN NOW
లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E
మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.



**ద్రాక్షారామ, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే ద్రాక్షారామం నుండి యానాం వెళ్లే ప్రధాన రహదారి నెత్తురోడుతోంది. వేగాయమ్మపేట పంచాయతీ పరిధిలోని రామారావుపేట మలుపు ఇప్పుడు ప్రయాణికులకు ప్రాణసంకటంగా, మృత్యుఒడిలా మారింది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రాణాలు గాలిలో కలిసిపోయేంత ప్రమాదకరంగా ఉన్న ఈ మలుపు వద్ద తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రోజుకో ప్రమాదం కళ్ళముందే జరుగుతున్నా, ప్రజల ప్రాణాలు పోతున్నా సంబంధిత అధికారులకు మాత్రం కనీస చీమ కుట్టినట్లు కూడా లేదు. ఈ ప్రమాదకరమైన మలుపు వద్ద కనీస హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్న స్పృహ, బాధ్యత అధికారులకు కరువైందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇక్కడ జరుగుతున్న వరుస ప్రమాదాలు, ఆసుపత్రుల పాలవుతున్న క్షతగాత్రుల ఆర్తనాదాలే ఇక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి. ఈ మలుపు వద్ద జరుగుతున్న ప్రమాదాల పరంపర స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. సరిగ్గా మూడు నెలల క్రితం అమాయకపు కూలీలతో వెళ్తున్న ఓ ట్రక్ ఆటో, మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో ఆటోను బలంగా ఢీకొట్టింది. ఆ సమయంలో ప్రయాణికుల హాహాకారాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. అదృష్టవశాత్తూ వారు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడి ప్రాణాలతో ఊపిరి పీల్చుకున్నారు. ఆ ఘటన తాలూకు భయం మరువక ముందే, కేవలం 20 రోజుల క్రితం ఇదే మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హుటాహుటిన కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. ఓ నిండు ప్రాణం గాలిలో కలిసిపోయి ఆ కుటుంబం వీధిన పడి రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. ఆ నెత్తుటి మరకలు ఆరకముందే, సరిగ్గా పది రోజుల క్రితం గ్రావెల్ లోడ్ తో వెళ్తున్న ఓ భారీ లారీ కూడా ఇదే ప్రదేశంలో ప్రమాదానికి గురై భయాందోళనలు సృష్టించింది. ఇవి కేవలం ఇటీవల వెలుగుచూసిన ఘటనలు మాత్రమే.. గడిచిన కాలంలో ఇక్కడ లెక్కకు మించి ప్రమాదాలు జరిగాయి, ఎంతో మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఒకపక్క పచ్చని కుటుంబాలు రోడ్డున పడుతున్నా, కళ్లముందే ఇన్ని ఘోరాలు జరుగుతున్నా అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలంటే అధికారులకు చులకన భావం ఏర్పడిందని, ఇంకెన్ని ప్రాణాలు బలి తీసుకున్నాక వారి కళ్ళు తెరుచుకుంటాయో అర్థం కావడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ప్రమాదకరమైన మలుపు అని సూచించే ఒక చిన్న బోర్డు ఏర్పాటు చేయకపోవడం అధికారుల పనితీరును ప్రశ్నిస్తోంది. రాత్రి వేళల్లో ఈ మలుపు అస్సలు కనిపించక కొత్తగా ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు ప్రాణాలరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ప్రజల సహనం నశించకముందే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలి. యుద్ధప్రాతిపదికన ఈ మలుపు వద్ద రేడియం హెచ్చరిక బోర్డులు, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రంబుల్ స్ట్రిప్స్, అలాగే ఎదురుగా వచ్చే వాహనాలను చూపే బ్లైండ్ కర్వ్ మిర్రర్స్ ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో ప్రజాగ్రహం చవిచూడక తప్పదని, మరిన్ని ప్రాణాలు గాలిలో కలవకుండా తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.



ఈ రామారావుపేట మలుపు వద్ద తరచుగా జరుగుతున్న ప్రమాదాలతో మేం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బండ్లు నడుపుతున్నాం. మొన్న ఆటో యాక్సిడెంట్, ఆ తర్వాత బైక్ మీద వెళ్తూ ఒక కుర్రాడు చనిపోవడం, లారీ బోల్తా పడటం కళ్లారా చూశాం. రాత్రి వేళల్లో ఈ మలుపు అసలు కనిపించదు. కనీసం ఒక హెచ్చరిక బోర్డు కూడా లేకపోవడంతోనే ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు, రేడియం బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం" అని స్థానిక వాహనదారుడు ఆవేదన వ్యక్తం చేశారు.

**బొమ్ము రాంబాబు (ఆటో డ్రైవర్ )**

# ఈనెల 27న రామచంద్రపురంలో ఉద్యోగ మేళా

## పలు కంపెనీల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు



**రామచంద్రపురం, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో రామచంద్రపురంలో నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయంగా జరుగుతున్న జాబ్ మేళాలో భాగంగా ఈ నెల 27 న తేదీన ఉదయం 10:00 నుండి కెవిఆర్ హాస్పిటల్ దగ్గర గల ఉపాధి ఆఫీసులో 48వ జాబ్ మేళా నిర్వహింపబడుతుందని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 18 నుంచి 30 సంవత్సరాలలో టెన్త్, ఇంటర్ ,ఐటిఐ, డిప్లమా, డిగ్రీ ,బీటెక్, అభ్యర్థులకు శ్రీ సిటీ, కర్నూలు, రేణిగుంట, పెనుగొండ, బెంగళూరు, హైదరాబాదు ,హోసూర్లో వివిధ పోస్టుల కొరకు డిక్సన్, కియా, ఫాక్స్ కాన్, ఐటిసి ఫుడ్స్ ,హీరో ,టాటా మోటార్స్, షిన్డర్ ,ఇండో ఎంఐఎం ,వంటి సుమారు 15 కంపెనీలలో అసెంబ్లింగ్ ఆపరేటర్, ప్రొడక్షన్ ,క్వాలిటీ డిపార్ట్మెంట్లలో ఉద్యోగాల కొరకు జాబ్ మేళా నిర్వహించ బడును. ఎంపికైన అభ్యర్థులకు 14000నుంచి 30వేల జీతం లభించును. అలాగే పిఎఫ్ ,ఈఎస్ఐ ,భోజన, వసతి, రవాణా, సదుపాయము ఆ కంపెనీలు ఆధారంగా లభించును. అర్హులైన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం కోరారు. మిగిలిన వివరములకు 7075704852 7075904852 నెంబర్లను సంప్రదించగలరు.

హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై గొర్రెల శ్రీనివాస్

# కళాజాత బృందం ద్వారా అవగాహన



**వెల్ల, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రాపురం మండలం రామచంద్రాపురం పట్టణం మార్కెట్ సెంటర్ మరియు వెల్ల గ్రామం కామెర్ల మందు సెంటర్ వద్ద హెచ్ ఐ వీ/ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దిశా/జనకళ్యాణ్ ప్రివెన్షన్ యూనిట్, లింక్ వర్కర్స్ స్కీమ్, చేంజెస్ సీఎస్ఓ ఫీల్డ్ స్టాఫ్ సహకారంతో ఐఈసీ (ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్) కార్యక్రమంలో భాగంగా గొర్రెల శ్రీనివాస్ బుర్రకథ బృందం కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా హెచ్ఐవీ ఎలా సంక్రమిస్తుంది, ఎలా సంక్రమించదు, హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్ఐవీ సోకిన వారికి అందుబాటులో ఉన్న చికిత్సా సేవలు, సుఖవ్యాధులు, టీబీ, డ్రగ్స్ వినియోగం, హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్‌కు సంబంధించిన ఉచిత సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే 1097 టోల్‌ఫ్రీ నంబర్, హెచ్ఐవీ/ఎయిడ్స్ చట్టం-2017, ఏఆర్టీ మందుల కేంద్రాలు, సుఖవ్యాధులు, టీబీ, క్యూఆర్ కోడ్ తదితర అంశాలపై వివరించారు. ప్రజలకు ఐఈసీ కరపత్రాలను పంపిణీ చెయ్యటం జరిగింది. ఈ కార్యక్రమంలో జనకళ్యాణ్ ప్రాజెక్ట్, దిశ లింక్ వర్కర్ స్కీమ్,సి.ఎస్.సి సిబ్బంది జి.శ్రీనివాస రావ్, దొరబాబు, ఈశ్వరి, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి డి.ఎస్.ఆర్.సి.కౌన్సిలర్ మరియు స్థానిక వర్తకులు రిక్షా వారు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి తొలిప్రాధాన్యత

## ప్రజా దర్బార్‌లో 34 అర్జీలు స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్




**రామచంద్రపురం, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి రాజీ ఉండదని, ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి ప్రజలు ప్రజా దర్బార్‌కు హాజరై తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మొత్తం 34 అర్జీలు అందాయి. రేషన్ కార్డులు, సామాజిక భద్రత పింఛన్లు, ఇళ్ల స్థలాల మంజూరు, రహదారుల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలు, డ్రైనేజీ సమస్యలు, విద్యుత్ సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. ప్రతి అర్జీని మంత్రి సుభాష్ స్వయంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ప్రజల వద్దకే చేరువ అవుతోందన్నారు. ప్రజల సమస్యలను వినడమే కాకుండా వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పారదర్శక, ప్రజాకేంద్రీకృత పాలన అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రజా దర్బార్ వంటి కార్యక్రమాలు ప్రజలకు ప్రభుత్వంపై మరింత నమ్మకాన్ని పెంచుతున్నాయని, ప్రతి అర్జీపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించి అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ సంక్షేమ ఫలాలను ప్రతి అర్హ కుటుంబానికి చేరవేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవల్లి శివ, రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, క్లస్టర్ 2 ఇన్చార్జ్ కంచుమర్తి బాబురావు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు పాల్గొన్నారు.

జై ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన

# గాయత్రి నృత్య అకాడమీ బృందాన్ని అభినందించిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గం కె .గంగవరం మండలానికి చెందిన గాయత్రి నృత్య అకాడమీ కొరియోగ్రాఫర్ కొల్లి గాయత్రి జై ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బెస్ట్ కొరియోగ్రాఫర్గా గుర్తింపు పొందడం, ఆమె శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రికార్డు ప్రదర్శనలో భాగస్వాములు కావడం ఎంతో గర్వకారణమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ప్రముఖ కళా సాంస్కృతిక సంస్థ మయూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా 80 నిమిషాల వ్యవధిలో 30 దేశభక్తి గీతాలపై నృత్య ప్రదర్శన చేసి జై ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన గాయత్రి నృత్య అకాడమీ బృందం ఆదివారం మంత్రి సుభాష్‌ను, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యంను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కొరియోగ్రాఫర్ కె. గాయత్రితో పాటు విద్యార్థులు సి. దుర్గ రేణుక, వి. లక్ష్మీ సాహిత్య, పీ.హెచ్.ఎస్. జ్యోత్స్న, కె. భవ్యశ్రీ, పి. హర్షిణి, రెడ్డి బాల త్రిపురసుందరి, పి. లాస్యశ్రీ, పి. అక్షిత, ఆర్. భాగ్యశ్రీ, ఎన్. బాన్విశ్రీ, ఎం. షణ్ముఖ లక్ష్మీశ్రీ, ఎం. చరిష్మా సూర్యశ్రీలు పాల్గొన్నారు. వీరందరినీ మంత్రి సుభాష్ ప్రత్యేకంగా అభినందిస్తూ, దేశభక్తి గేయాలకు నృత్య రూపకాలు ప్రదర్శించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. చిన్న వయసులోనే ప్రతిభను చాటుతూ రామచంద్రపురం నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావడం ప్రశంసనీయమని కొనియాడారు. కళలకు అంకితభావంతో మరింత సాధన చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కొరియోగ్రాఫర్ కె. గాయత్రి, విద్యార్థుల బృందానికి మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యం శుభాకాంక్షలు తెలిపారు.



జిల్లా టిడిపి అధికార ప్రతినిధి

# రాజబాబును పరామర్శించిన యనమల



కోటనందూరు, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ : ఇటీవల గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గాడిరాజబాబును మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు పరామర్శించారు. కోటనందూరు మండలం కమత మల్లవరంలో గాడి రాజబాబు పార్టీ శ్రేణులతో కలిసి తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగితెలుసుకున్నారు. త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి వచ్చి సేవలు కొనసాగించాలని యనమల ఆకాంక్షించారు. యనమల వెంట తుని మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్ కోటనందూరు మండల టీడీపీ అధ్యక్షుడు పోతల సూరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకంరెడ్డి రమేష్,లోవ దేవస్థానం చైర్మెన్ పెంటకోట భాస్కర సత్యనారాయణ, మాజీ చైర్మెన్ గొర్లి అచ్చయ్య నాయుడు, డాక్టర్ వెలగా వెంకట కృష్ణారావు, అంకంరెడ్డి బుల్లిబాబు, షేక్ నవాబ్ జానీ,సుర్ల సింహాద్రి,ఎల్ ఎస్ ఎన్ మూర్తి బైలపూడి శ్రీరామ్మూర్తి, గుడివాడ తాతబాబు, చందక శ్రీను,కొరుప్రోలు రఘునాథ్, సామినీడి కృష్ణార్జున, తదితరులు వెంట ఉన్నారు.

# రాష్ట్రానికి దూరంగా పవన్.. ఎందుకంటే..?



పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అంతే కాదు ఆయన జనసేన అధినేత. అలాగే పవర్ స్టార్ కూడా. ఎంతో బిజీ లైఫ్ ని లీడ్ చేస్తున్న పవన్ కళ్యాణ్ రాష్ట్రానికి దూరంగా ఇరవై రోజుల పాటు ఉండబోతున్నారు. పవన్ ఎపుడూ ఇన్నాళ్ళు సొంత రాష్ట్రానికి దూరమూ ఉండలేదు. ఇది తొలిసారి అని అంటున్నారు. ఎందుకు అంటే పవన్ ప్రకృతి వైద్యం కోసం అని అంటున్నారు. ఇక పవన్ వైద్యుల సూచన మేరకు తన కుడి భుజానికి ఆయుర్వేద థెరపీ చేయించుకునేందుకు శనివారం కేరళం రాష్ట్రానికి వెళ్తున్నారు.

**తదుపరి చికిత్సలో భాగం :** ఇక ఇటీవల చూస్తే . ఇటీవల ముంబైలో పవన్ తన కుడి భుజం రొటేటర్ కఫ్ గాయానికి శస్త్ర చికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. వైద్యుల సూచన మేరకు తదుపరి చికిత్సలో భాగంగా ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారని అంటున్నారు. నిజానికి శస్త్ర చికిత్స అనంతరం వైద్యులు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని పవన్ కి తెలిపారు. కొంతకాలం బహిరంగ కార్యక్రమాలక్లు అలాగే విధులకి దూరంగా ఉండాలని కూడా వైద్యులు సూచించారు. కానీ పాలనా బాధ్యతల దృష్ట్యా వారం రోజుల్లోనే పవన్ కళ్యాణ్ మంగళగిరిలోని క్యాంపు కార్యాలయానికి అందుబాటులోకి వచ్చారు. ముందస్తుగా ఖరారైన ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనడంతో పాటు ఆయన వరుసగా శాఖాపరమైన సమీక్షలు చేశారు. అలాగే పార్టీ అంతర్గత సమావేశాలను నిర్వహించడం వంటి వాటితో బిజీగా గడిపారు. ఈ క్రమంలోనే ఆయనకు శస్త్ర చికిత్స చేసిన భుజం భాగంలో వాపు పెరగడంతోపాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చింది. దాంతో ప్రస్తుతం వైద్యుల సలహా మేరకు భుజం పూర్తిస్థాయిలో కోలుకునేందుకు కేరళంలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారని అంటున్నారు.

**అభిమానుల ఆందోళన :** ఇదిలా ఉంటే పవన్ కళ్యాణ్ కేరళంలో నేచురోపతి ఆయుర్వేద పంచకర్మ వైద్యం చేయించుకోనున్నారుని తెలుస్తోంది. ఆయన ఏకంగా సెప్టెంబర్ 10 దాకా అక్కడే ఉంటారని చెబుతున్నారు. పవన్ ఇన్నాళ్ళ పాటు రాష్ట్రానికి దూరంగా ఉండడం పట్ల అభిమానులు అయితే ఆందోళన చెందుతున్నారు. అయితే పవన్ సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా ఉండడం కోసమే ఈ ప్రకృతి వైద్యం అని చెబుతున్నారు. ఈ ప్రకృతి వైద్యం అన్నది శాశ్వతంగా పవన్ కి ఆరోగ్యాన్ని అందిస్తుంది అని అంటున్నారు. మరో వైపు చూస్తే కేరళంలోని ప్రకృతి వైద్యానికి దేశవ్యాప్తంగా పేరు ఉందని చెబుతున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఇక్కడి ప్రకృతి వైద్యాన్ని నమ్ముతారు అని అంటున్నారు. అందుకే పవన్ ఈ నిర్ణయానికి వచ్చారు అని అంటున్నారు.

**ఈ మధ్యన తరచూ అలా :** ఇక చూస్తే పవన్ తరచూ తీవ్రమైన జ్వరంతో పాటు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆయన కేబినెట్ మీటింగ్స్ కి కూడా హాజరు కాలేకపోతున్నారు. ఈ మధ్యనే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎట్ హోం కి వెళ్ళకుండా ఆయన జ్వరంతో హైదరాబాద్ కి వెళ్ళిన సంగతి తెలిసిందే. అందుకే ఆయన కేరళం నేచరల్ థెరఫీ పట్ల దృష్టి సారించారు. ఇక పవన్ ఇన్ని రోజుల పాటు ఏపీలో ఉండరని తెలిసిన నేపథ్యంలో ఆయన మంత్రిత్వ శాఖలు ఎవరు చూస్తారు అన్న చర్చ సాగుతోంది. అయితే సీనియర్ నేత మంత్రి నాదెండ్ల మనోహర్ పవన్ శాఖలు చూస్తారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే పవన్ కళ్యాణ్ ఇరవై రోజులకు పైగా ఏపీకి దూరంగా ఉంటున్నారు. ఇది నిజంగా అభిమానులకు ఆందోళన కలిగించే వార్తే కానీ పవన్ క్షేమంగా లాభంగా ఆరోగ్యంగా తిరిగి రావాలని అంతా కోరుకుంటున్నారు.

# చిన్న క్లూతో చిక్కేసిన సాధిక్...లేట్ అయితే చెక్కేసేవాడే !



కాకినాడ పంచాయతీ రాజ్ ఏఇ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడు సాధిక్ ఖాన్ ని ఎట్టకేలకు కాకినాడ పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. నూకరాజు కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకోవడానికి సాధిక్ ఖాన్ కారకుడు అన్నది పోలీసుల దర్యాప్తులో వెల్లడి అయింది. దాంతో ఈ నిందితుడు తప్పించుకునే ప్రయత్నం చూస్తే వేరే లెవెల్ అని చెప్పాల్సిందే. ఎక్కడా ఫోన్ చేయకుండా డిజిటల్ ఆర్థిక లావాదేవీలు చేయకుండా అయిదు రోజుల పాటు గడిపాడు. ఈ విషయంలో చాలా తెలివిగా వ్యవహరించాడు. వామ్మో వీడు సామాన్యుడు కాదు అన్నట్లుగా నిందితుడు స్టోరీ ఉంది. అయిదు రోజులలో ఏకంగా నాలుగు రాష్ట్రాలను దాటేసిన ఈ నిందితుడు జస్ట్ కొన్ని గంటలు పోలీసులు ఆలస్యం చేస్తే కచ్చితంగా విదేశాలకు పారిపోయేవాడు. కేరళ నుంచి సముద్ర మార్గం గుండా విదేశాలకు చెక్కేసేందుకు పకడ్బంధీగా స్కెచ్ గీసిన సాధిక్ ఖాన్ ని ఎంతో చాకచక్యంగా కాకినాడ జిల్లాకు చెందిన పోలీసులు ఉత్తర ప్రదేశ్ లోని మీరట్ లో అదుపులోకి తీసుకున్నారు. సినిమా ఫక్కీలో సాగిన సాధిక్ ఖాన్ పరారీ ఉదంతాన్ని పోలీసులు ఎట్టకేలకు చేదించారు. అతన్ని కాకినాడకు తీసుకుని వస్తున్నారు. సోమవారం కోర్టులో హాజరు పరచేందుకు రంగం సిద్ధం చేశారు.

**ప్రధాన నిందితుడిగా :** ఇదిలా ఉంటే కాకినాడకు చెందిన పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబం గోదావరి నదిలో దూకి సామూహికంగా ఆత్మహత్యలకు పాల్పడిన కేసుకు సంబంధించి రైఫిల్ షూటింగ్ కోచ్ షేక్ సాధిక్ ఖాన్ ప్రధాన నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. సాధిక్ వేధింపులు బ్లాక్‌మెయిల్ తట్టుకోలేకే తాము ప్రాణాలు తీసుకుంటున్నట్లు నూకరాజు ఆయన కూతురు సౌజన్య రాసిన లేఖలు పోలీసుల దర్యాప్తులో వెంటనే వెలుగులోకి వచ్చాయి. అయితే ఈ నెల 16న నూకరాజు కుటుంబం ఆత్మహత్య చేసుకుంది. ఆ విషయం తెలిసిన వెంటనే సాధిక్ ఖాన్ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. నూకరాజు కుటుంబం ఆత్మహత్య చేసుకున్న అర్ధరాత్రి సాధిక్ మాట్లాడిన ఒక ఫోన్ కాల్ అతన్ని పట్టించింది. ఇక అదే రోజు అర్ధరాత్రి సామర్లకోట జంక్షన్ లో కోణార్క్ ట్రైన్ ఎక్కిన సాధిక్ ఖాన్ అక్కడ ఒక వ్యక్తి దగ్గర ఫోన్ తీసుకుని కాకినాడలోని ఒక న్యాయవాదికి తన సోదరికి ఫోన్ చేసినట్లుగా పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. దీంతో ఈ నంబర్ ని ట్రాక్ చేసి మాట్లాడిన కాకినాడ పోలీసులకు అక్కడే సరిగ్గా క్లూ మొత్తం దొరికింది.

**ఎక్కడెక్కడికి వెళ్ళాడన్నది :** ఇక సాధిక్ ఖాన్ కర్ణాటకలోని వాడి రైల్వే స్టేషన్ లో సాధిక్ ఖాన్ దిగి ఉండవచ్చని కూడా పోలీసులు ఆలోచించి ఆ దిశగా దర్యాప్తుని ముమ్మరం చేశారు. వాడి స్టేషన్ లో సీసీ కెమెరా ఫుటేజీలని కూడా వారు పరిశీలించారు. కర్ణాటకలోని వాడి రైల్వే స్టేషన్‌లో సాధిక్ ఖాన్ కదలికలపై పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేశారు. అక్కడ ఒక స్థానికుడితో సాధిక్ ఖాన్ మాట్లాడినట్లుగా గుర్తించారు. దాంతో పోలీసులు అతన్ని ఆరా తీయగా షోలాపూర్ వెళ్లే బస్సుల కోసం ఆరా తీసినట్లుగా చెప్పాడు. ఇక షోలాపూర్ వెళ్లిన పోలీసులు సాధిక్ ఖాన్ పాత ఫోన్ నంబర్ల మీద పూర్తి నిఘా ఉంచారు. అక్కడ ఒక ఫ్రెండ్ వివరాలను సేకరించి అతన్ని ప్రశ్నించడంతో సాధిక్ ఖాన్ పూర్తి కదలికపైన ఒక క్లారిటీ వచ్చింది. ఒక లాడ్జిలో ఉండేందుకు తాను సహాయం చేశాను అని సదరు ఫ్రెండ్ చెప్పడంతో పోలీసులకు మరింత క్లూ దొరికింది. ఇక ఢిల్లీ మీరట్ పోలీసుల సాయంతో అక్కడ గాలింపు చర్యలను పోలీసులు వేగవంతం చేశారు. దాంతో సాధిక్ ఖాన్ కి ఆశ్రయం కల్పించిన వ్యక్తి పోలీసులకు చిక్కాడు. ఇక పోలీస్ పద్ధతిలో అతన్ని ప్రశ్నించేసరికి సాధిక్ ఖాన్ వివరాలు మొత్తం చెప్పేశాడు. వెంటనే సాధిక్ ఖాన్ ని పట్టుకుని మీరట్ కోర్టులో పోలీసులు హాజరు పరచారు. అనంతరం ట్రాన్సిట్ వారెంట్ మీద కాకినాడకు తరలించినట్లుగా తెలుస్తోంది. ఇక సాధిక్ ఖాన్ ని సోమవారం కాకినాడ కోర్టులో హాజరు పరచేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు.

**ఉల్లిక్కి పరచిన ఉదంతం :** ఇదిలా ఉంటే ఏఇ నూకరాజు కుటుంబం సామూహిక అత్మహత్య రాష్ట్రం మొత్తాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఆగస్టు 16న రాజమండ్రి గోదావరి వంతెనపై నూకరాజు కుటుంబం నదిలో దూకింది.ఈ ఘటనలో నూకరాజు, ఆయన భార్య మీనా కూతురు సౌజన్య మృతి చెందగా 10 ఏళ్ల మనవడు ప్రాణాలతో బయటపడ్డాడు. సాధిక్ ఖాన్ తనను వేధించాడని మతం మారాలని బలవంతం చేశాడని సౌజన్య లేఖలో ఆరోపించింది. సౌజన్య భర్త జగదీశ్వరరెడ్డి మృతి వెనుక కూడా సాధిక్ ప్రమేయం ఉందని కుటుంబ సభ్యులు ఆరోపించారు ఈ కేసుకు సంబంధించి పోలీసులు సాధిక్ ఖాన్ ప్రధాన నిందితుడు అని పోలీసులు గుర్తించడమే కాదు పక్కా సమాచారంతో పకడ్బందీ యాక్షన్ తో త్వరగానే పట్టుకోవడం విశేషం.

# 'దక్షిణాది'ని దారితెచ్చుకున్నారా?!



పార్లమెంటు నియోజకవర్గాల విభజన విషయంలో ఆది నుంచి వ్యతిరేకిస్తున్న దక్షిణాది రాష్ట్రాలను కేంద్రం మెత్త బడేలా చేసిందా? నియోజకవర్గాల పునర్విభజన అంశంలో తమిళనాడు, కర్ణాటకలు కొంత మేరకు స్వరం సరిచేసుకున్నాయా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. తాజాగా చెన్నైలో జరిగిన దక్షిణ ప్రాంత సదస్సు(సదరన్ జోనల్ కాన్ఫరెన్స్)లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. ఈ విషయా న్ని ప్రస్తావించారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి ఎలాంటి నష్టం జరగదని పేర్కొన్నారు. అంతే కాదు.. నష్టం జరిగే అవకాశం ఉంటే కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోదని కూడా చెప్పారు. దీంతో తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు ఈ విషయం కొంత మేరకు మెత్తబడినట్టు తెలిసింది. దీంతో నియో జకవర్గాల పునర్విభజన అంశంలో తమిళనాడు.. ప్రస్తుతం ఉన్న పార్లమెంటు నియోజకవర్గాల ప్రాతిని ధ్యం విషయంలో తమ రాష్ట్రానికి నష్టం చేయకుండా చూడాలని కోరుతూ.. సీఎం విజయ్ కేంద్రానికి లేఖ రాశారు. అదేవిధంగా కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సైతం.. తమకు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. ఇక, కేరళ, ఏపీలు పార్లమెంటు పునర్విభజనకు రెడీగా ఉన్నాయి. తెలంగాణ మాత్రం ఈ విషయంపై ఇప్పటికీ మౌనంగానే ఉంది. ఈ నేపథ్యంలో ఆది నుంచి పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనపై సందేహాలు వ్యక్తం చేస్తున్న దక్షిణాది రాష్ట్రాలు దారిలో పడ్డాయన్న సంకేతాలు వస్తున్నాయి. ఫలితంగా పార్లమెంటులో ఈ బిల్లును ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. వాస్తవానికి పార్లమెంటు సమావేశాలు ఇప్పటికే ముగిశాయి. ఈ నెల 13తోనే వర్షాకాల సమావేశాలు ముగిసిపోయాయి. కానీ, పార్లమెంటును ప్రోరోగ్(పూర్తిస్థాయి వాయిదా) చేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేయలేదు. అంటే.. ఎప్పుడైనా మరోసారి పార్లమెంటును కొలుదీర్చే అవకాశం ఉంది. వచ్చే సమావేశాల నాటికి.. నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ఆమోదించుకుని.. మహిళా రిజర్వేషన్‌ను దీనికి అనుసంధానం చేయాలని కేంద్రం భావిస్తున్న దరిమిలా.. పార్లమెంటు సమావేశాలు వచ్చే వారంలో ఉండే అవకాశం ఉందని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# జగన్ జిల్లాల టూర్లు... స్థానిక ఎన్నికల కోసమేనా..?



వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జిల్లాల టూర్ల అంశం మరోసారి ప్రచారంలోకి వస్తోంది. నిజానికి 2024 డిసెంబర్ నుంచి ఇదే రకమైఅ ప్రచారం సాగుతూ వచ్చిన సంగతి తెలిసిందే. దాని మీద అనేక డేట్లూ ముహూర్తాలు కూడా సోషల్ మీడియాలో వచ్చాయి. కానీ ఏవీ నిజం కాలేదు. అయితే ఇపుడు మరో మారు ఆ ప్రస్థావన వస్తోంది. మరో రెండు నెలలలో ఏపీలో స్థానిక ఎన్నికలు ఉన్నాయి. దాంతో జగన్ జనంలోకి వెళ్తారు అని అంటున్నారు. ఒక విధంగా ఇది స్థానిక ఎన్నికల ప్రచారం కింద కూడా భావించాల్సి ఉంటుందని అంటున్నారు.

**అప్పట్లో వెళ్ళనే లేదు :**

ఇక జగన్ అధికారంలో ఉన్నపుడు 2021లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. అయితే జగన్ ఎక్కడా ప్రచారం చేయలేదు, స్థానికంగా జరిగే ఎన్నికల్లో ఎందుకు ప్రచారం అన్నది ఒక ఆలోచన అయితే అధికారంలో ఉన్న పార్టీ అన్నీ అనుకూలంగా ఉంటూ వస్తాయని ధీమా ఉంది. దాంతో పార్టీకి మంత్రులకు ఆ బాధ్యతలను అప్పగించారు. ఇక పవర్ చేతిలో ఉండడంతో వైసీపీకి నూటికి తొంబై శాతం స్థానిక ఫలితాలు అనుకూలంగా వచ్చాయి. దాంతో వైసీపీ ఫుల్ ఖుషీ అయింది. ఇక తమదే 2024 ఎన్నికలు అని కూడా భావించింది. కానీ 2024 ఎన్నికలు రివర్స్ అయ్యాయి. ఇక చూస్తే ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు అయితే ఎంతో పట్టుదలగా స్థానిక ఎన్నికల ప్రచారం చేశారు.

**ఢీ అంటే ఢీ కొడుతూ :**

అయితే ఈసారి మాత్రం జగన్ జనంలోకి వెళ్ళాలని అనుకుంటున్నారు అని తెలుస్తోంది. అయితే స్థానిక ఎన్నికల ప్రచారంగా ఇది ఉండకుండా జిల్లాల టూర్లు పేరుతో జగన్ జనంలోకి వస్తారు అని అంటున్నారు. ముఖ్యంగా వైసీపీ పట్టణాల మీద ఫోకస్ పెడుతోంది. గ్రామీణ ప్రాంతంలో కొంత మొగ్గు తమకు ఉండొచ్చు అన్న ధీమా అయితే ఫ్యాన్ పార్టీకి ఉంది. కానీ అదే సమయంలో పట్టణాలు నగరాలలో అనుకున్న స్థాయిలో పెర్ఫార్మెన్స్ చేయలేకపోవచ్చు అన్నది కూడా పార్టీకి ఉంది. దాంతోనే జనంలోకి వెళ్ళి రెండేళ్ళ కూటమి పాలన మీద వాస్తవాలను వివరించడం ద్వారా జగన్ వైసీపీకి ఎంతో కొంత సానుకూలత చేయాలని చూస్తున్నారు అని అంటున్నారు. ముఖ్యంగా మేయర్ పీఠాల మీద వైసీపీ ఫోకస్ పెడుతోంది అని అంటున్నారు. విశాఖ విజయవాడ తిరుపతి వంటి మేయర్ పదవులకు ఎంతో ప్రతిష్ఠ ఉంది. దాంతో వాటిని కైవశం చేసుకోవడమైనా గట్టి పోటీ ఇవ్వడం అయినా చేస్తే వైసీపీకి భవిష్యత్తులో కూటమిని ఎదుర్కొనేందుకు మరింత సులువు అవుతుందని అంచనా కడుతోంది.

**పార్టీ భేటీలో నిర్ణయం :**

జగన్ జిల్లా టూర్ల మీద ఈ నెల 25న జరిగే వైసీపీ 175 మంది అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జిలు కీలక నేతల సమావేశంలో చర్చిస్తారు అని అంటున్నారు. పార్టీ నేతల అభిప్రాయాలను కూడా తీసుకుంటారు అని అంటున్నారు. అలాగే క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులు, నగరాలు పట్టణాలు గ్రామాలలో వైసీపీ గ్రాఫ్ ఏ మేరకు పెరిగింది అన్నది కూడా తెలుసుకోవడమే కాకుండా పార్టీకి స్పష్టమైన దిశా నిర్దేశం కూడా జగన్ ఇస్తారు అని అంటున్నారు. మొత్తానికి చూస్తే వైసీపీ కూడా స్థానిక ఎన్నికలను సీరియస్ గానే తీసుకుంటోంది అని అంటున్నారు. దాంతో లోకల్ ఫైట్ సంచలనం రేకెత్తించనుంది.



# అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

## వేములపల్లి శివార్లలో 220 క్వార్టర్ బాటిళ్లు, మోటార్ సైకిల్ స్వాధీనం



**మండపేట మండలం, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మండలం వేములపల్లి శివార్లలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని మండపేట రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 220 క్వార్టర్ మద్యం బాటిళ్లతో పాటు తరలింపునకు ఉపయోగించిన మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ పీ దొరరాజు తెలిపిన వివరాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఈస్ట్‌జోన్ డీఎస్పీ పర్యవేక్షణలో వేములపల్లి గ్రామ శివార్లలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఎస్ఐ వీ కిషోర్ ఆధ్వర్యంలో హెచ్‌సీ 564, పీసీ 3819, హెచ్‌జీ 979 సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా మోటార్‌సైకిల్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు కనిపించారు. వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా నల్లజర్ల మండలం చీపురుగోడెంకు చెందిన చల్లారి రాజు పట్టుబడగా అదే మండలం మార్లమీడి గ్రామానికి చెందిన గరిసికోట మాణిక్యం పరారయ్యాడు. పట్టుబడిన చల్లారి రాజును తనిఖీ చేయగా 220 క్వార్టర్ మద్యం బాటిళ్లు లభించినట్లు దొరరాజు తెలిపారు. యానం ప్రాంతంలో మద్యం కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయించేందుకు తీసుకువెళ్తున్నట్లు చల్లారి రాజు విచారణలో చెప్పాడన్నారు. నిందితుడిని ఆలమూరు కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. అలాగే పరారైన మరో వ్యక్తి కోసం గాలింపు చేపట్టారు.

### కోరుకొండలో ఘనంగా

# మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు



**కోరుకొండ ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలు కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. శనివారం చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని కోరుకొండలో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు, జనసేన పార్టీ మండల గౌరవ అధ్యక్షులు బదిరెడ్డి దొర ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిరంజీవి జన్మదిన వేడుకలు సందర్భంగా చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్, చిరంజీవి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చిరంజీవి నటుడిగా, రాజకీయ సామాజికవేతగా ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు బదిరెడ్డి దొర, జాజుల గణేష్, పచారి నరసింహమూర్తి, కటకం శేషు,కర్రి పెంటజి, కొచ్చర్ల బాబి, కటకం శ్రీనివాస్, పెద్దింటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### కోరుకొండ మండలంలో

# ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్న సర్వేయర్లు

## నిబంధనలకు తూట్లు - ఏకపక్ష నిర్ణయాలతో రైతులకు పాట్లు - సర్వేయర్లపాలిట అక్షయపాత్రగా రీ-సర్వే



**కోరుకొండ ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలంలో కొందరు సర్వేయర్లు ఏకపక్షపాత్ర పోషిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం పై మండలంలోని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏకపక్ష పాత్ర రాత్రి వేళల్లో కూడా పోషించడం గగనార్హం. కోరుకొండ మండలంలో రీ-సర్వే పేరుతో సర్వేయర్లు కొద్దిమంది రైతుల తరుపున ఏకపక్షంగా వ్యవహరిస్తూ వారి నుండి పెద్ద ఎత్తున ముడుపులో తీసుకుంటున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. రీ- సర్వే చేస్తున్న సమయంలో సంబంధిత రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వారి పొలాలను సర్వే చేస్తూ, వారి ప్రమేయం లేకుండానే చేతులు తడుపుతున్న రైతులకు వత్తాసు పలుకుతూ అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. గతంలో రీ- సర్వే సమయంలో చేసిన తప్పులని ప్రస్తుత సర్వేయర్లు సాగిస్తున్నరన్న ఆరోపణ జోరుగా వినిపిస్తున్నాయి. తాసిల్దార్లకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా చేస్తున్న సర్వేలో, రైతులతో బేర సారాలు సాగిస్తున్న వ్యవహారంలో వేలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. సర్వేయర్లు రీ-సర్వే సమయంలో సంబంధిత రైతులకు నోటీసు ద్వారా తెలియచేయ కుండా ఆ రైతులు లేకుండానే వారి పొలాల్లో సరిహద్దులు వేయడంతో రైతుల తీవ్రఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రి-సర్వే సమస్యలను ప్రాధాన్యత క్రమంలో కాకుండా చేతులు తడిపిన రైతులకు వేగంగా పనులు చేస్తున్నరన్న వాదనలో వినిపిస్తున్నాయి. మొత్తం మీద కోరుకొండ మండలంలో రీ-సర్వే పనులు సర్వేయర్ల పాలిట అక్షయపాత్రగా మారిందని పలువురు వాపోతున్నారు. కోరుకొండ మండలంలో ఒకపక్క 22(ఏ) పనులు నేటికీ పూర్తి కాకపోవడం, మరోపక్క రి-సర్వేలో సర్వేయర్ల చేతివాటం వెరసి ఎన్డీఏ ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందనడంలో అతిశయోక్తి లేదు. తాసిల్దారులు, రీ-సర్వే డిప్యూటీ తాసిల్దార్లు ఇటువంటి వ్యవహారాలపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

### వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద

# గణపతి నవరాత్రులకు పందిరి శుభ ముహూర్తం



**కోరుకొండ ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ కొత్తూరులో శ్రీ భూదేవి శ్రీదేవి సమేత సంతాన వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గణపతి నవరాత్రుల మహోత్సవంలో భాగంగా పందిరి రాట వేయడానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుభ ముహూర్తం చేశారు. ఆదివారం వెంకటేశ్వరస్వామి ఆలయకమిటీ సభ్యులు, యువత గణపతి నవరాత్రులు ప్రతి ఏడాది అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. యావన్మంది భక్తులు గణపతి నవరాత్రుల మహోత్సవాలను పురస్కరించు కొని ప్రతి ఏడాది వలె, ఈ ఏడాది కూడా పూర్తి సహాయ సహకారాలు అందించి గణపతి నవరాత్రి మహోత్సవంలో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరమళ్ళ వెంకట జేజి, కర్రి లక్ష్మి సరోజ గణేష్, తాటికొండ బుజ్జి, మండపాక శ్రీనివాస్, యువత తదితరు పాల్గొన్నారు.

### బిజెపి జాతీయ కమిటీలో

# ఆంధ్రప్రదేశ్‌కు సముచిత స్థానం : నీరుకొండ

## నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్షులు, కోఆర్డినేటర్‌కు అభినందనలు



**కోరుకొండ ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ జాతీయ కమిటీలు ఆంధ్రప్రదేశ్ కు సముచిత స్థానం దక్కిందని, దీంతో మోడీకి ఆంధ్రప్రదేశ్ పై ఉన్న మక్కువ తేటతెల్లమయిందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు రాజానగరం నియోజవర్గ మాజీ ఇంచార్జ్ నీరుకొండ వీరన్నచౌదరి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ అధ్యక్షతన జాతీయ పదాధికారుల సమావేశం, కొత్త జాతీయకార్యవర్గ సమావేశం జరిగిందన్నారు.జాతీయగీతం వందేమాతరం పూర్తి స్థాయిలో ఆలపించడం శుభపరిణామన్నారు. భాజాపాను దేశవ్యాప్తంగా మరింత బలోపేతం చేయడం,పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరేలా చేయడం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. జాతీయ అధ్యక్షుడు ప్రకటించిన నూతన జాతీయకమిటీలో ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయ ఉపాధ్యక్షులుగా రామ్ మాధవ్, దగ్గుపాటి పురందేశ్వరి,ఆల్ సెల్స్ జాయింట్ కో ఆర్డినేటర్ గా విష్ణు వర్ధన్ రెడ్డి సముచిత స్థానం కల్పించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన వారు భాజపా బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తారని, తద్వారా పార్టీ ఢిల్లీ నుంచి గల్లీ దాకా మరింత ప్రతిష్టపడుతుందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రామ్ మాధవ్, దగ్గుబాటి పురందేశ్వరి, విష్ణువర్ధన్ రెడ్డిలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

### సెంట్రల్ బ్యాంక్ అసోసియేషన్

# వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గాజింగం ఎన్నిక

## గాజింగంకి పలువురు అభినందనలు



**కోరుకొండ ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కోరుకొండ డిసిసిబి బ్యాంక్ మేనేజర్ గాజింగం అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రావులపాలెంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికల్లో గాజింగం అప్పారావు వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో జిల్లా సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగులు, కోరుకొండ, బూరుగుపూడి, శ్రీరంగపట్నం, దోసకాయలపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు, సొసైటీ సిబ్బంది తదితరులు గాజింగానికి అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ తనపై ఎంత నమ్మకంతో వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సెంట్రల్ బ్యాంక్ సహచర ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, అందరితో మమేకమే సంఘ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

### వాహనాల రికార్డులను

# సక్రమంగా ఉంచుకోండి

## డీఎస్పీ జీవన

## డ్రైవింగ్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు




**కోరుకొండ ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** వాహనదారులు తమ వాహనాల రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని రాజమహేంద్రవరం ఉత్తర మండల డిఎస్పి జీవన తెలిపారు. ఆదివారం పశ్చిమగోనగూడెం ఎలక్ట్రికల్ ఆఫీస్ వద్ద ద్విచక్ర వాహనదారులకు వాహనాల రికార్డులు, డ్రైవింగ్ నిబంధనలు, త్రిబుల్ డ్రైవింగ్, మితిమీరిన వేగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే, ఏదైనా ప్రమాణ సంభవించినప్పుడు మైనర్ల తల్లిదండ్రులే బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు. వాహనాలు రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. త్రిబుల్ డ్రైవింగ్, అతివేగం వల్ల ఎదురవుతున్న ప్రమాదాలను వాహనదారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తర మండల డిఎస్పి జీవన, ఎస్సై వెంకట రమేష్, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

# విజయ ఆర్థోకేర్ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, ఆగస్టు 23, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పట్టణ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా టౌన్ హాల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన “విజయ ఆర్థోకేర్ హాస్పిటల్” ను ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండపేట పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన ఆర్థోపెడిక్ సేవలు అందించే లక్ష్యంతో ప్రారంభించిన ఈ హాస్పటల్ లో ఆధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులతో మెరుగైన చికిత్స అందించి ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాలని హాస్పిటల్ యాజమాన్యానికి సూచించారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
✦ సువర్ణావకాశం ✦
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

# ఊహించని మలుపులు.. చూస్తున్నంతసేపు ఉత్కంఠ పెంచే సస్పెన్స్..



ప్రస్తుతం ఓటీటీ ప్రపంచంలో ప్రతివారం కొత్త కొత్త సినిమాలు అందుబాటులోకి వస్తుంటాయి. అయితే సస్పెన్స్, థ్రిల్లర్, హారర్ జోనర్లను ఇష్టపడే ప్రేక్షకుల కోసం నిత్యం ఏదోక మూవీ స్ట్రీమింగ్ అవుతూనే ఉంటుంది. కొన్ని సినిమాలు చూస్తున్నంతసేపు క్షణక్షణం ఉత్కంఠ రేపుతూ రొమాలు నిక్కబొడుచుకునేలా చేస్తాయి. ఇప్పుడు అలాంటి సినిమా గురించి మనం మాట్లాడుకుందాం. డిజిటల్ వినోద ప్రపంచంలో ప్రతివారం అనేక చిత్రాలు అందుబాటులోకి వస్తుంటాయి. అయితే, ప్రేక్షకుల నరాల్లో ఉత్కంఠను రేకెత్తించి, ఒళ్లు గగుర్పొడిచే అనుభూతిని ఇచ్చే సస్పెన్స్, హారర్ థ్రిల్లర్ చిత్రాలకు ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన డిమాండ్ ఉంటుంది. సరిగ్గా అలాంటి భయానకమైన, సైన్స్ ఫిక్షన్ మిస్టరీ అనుభూతిని ఇస్తూ ఓటీటీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది తెలుగు చిత్రం 'నాట్ ఆల్ మూవీస్ ఆర్ ది సేమ్: డ్యూయల్'. ఈ సినిమా ప్రత్యేకత ఏంటంటే ఇందులో రెండు భిన్నమైన కథలు ఉంటాయి. మొదటి కథ: ఒక వ్యక్తి తన వద్ద ఉన్నదంతా కోల్పోయి, అత్యంత ప్రమాదకరమైన జాంబీల ప్రపంచంలో చిక్కుకుంటాడు. భయంకరమైన ఆ వాతావరణం నుంచి అతడు తన ప్రాణాలను ఎలా కాపాడుకున్నాడు? అసలు అతడు ఆ పరిస్థితిలోకి ఎందుకు నెట్టబడ్డాడు? అనేది మొదటి కథాంశం. రెండో కథ: ఒక పేద మత్స్యకారుడికి తన గ్రామం సమీపంలోని సరస్సు ఒడ్డున నోట్ల కట్టలతో ఉన్న ఒక బ్యాగ్ దొరుకుతుంది. ఆ డబ్బుతో తన పేదరికం తీరిపోయిందని సంతోషించే లోపే, అతని జీవితంలో ఊహించని భయానక పరిణామాలు మొదలవుతాయి. ఆ డబ్బుల బ్యాగ్‌తో పాటు ఒక దుష్టశక్తి (ప్రేతాత్మ) అతని వెంటపడి వేధించడం ప్రారంభిస్తుంది. ప్రారంభంలో ఈ రెండు కథలకు ఒకదానితో ఒకటి సంబంధం లేనట్లే కనిపిస్తాయి. కానీ కథ ముందుకు సాగుతున్న కొద్దీ, పరాకాష్ట (క్లైమాక్స్) వైపు వచ్చేసరికి ఈ రెండు విభిన్న కథల మధ్య ఉండే కనెక్షన్ బయటపడుతుంది. అది చూసే ప్రేక్షకులకు మైండ్ బ్లాంక్ అయ్యేలా షాకింగ్ ట్విస్ట్ ఇస్తుంది. సగిరాజు సురేష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైగ్రేటింగ్ బర్డ్స్ ఫిల్మ్స్ పతాకంపై గీతా పెన్మత్స నిర్మించారు. రోషిణి అరవిందాక్షన్, రఘు వర్ధన్, ఖుషీ పిల్లలు ప్రధాన పాత్రల్లో అద్భుతంగా నటించారు. సుమారు 97 నిమిషాల నిడివి ఉన్న ఈ సైన్స్ ఫిక్షన్ హారర్ థ్రిల్లర్ చిత్రం ప్రస్తుతం రెండు ప్రముఖ ఓటీటీ వేదికలైన అమేజాన్ ప్రైమ్ వీడియో, లయన్స్ గేట్ ప్లేలలో డిజిటల్ స్ట్రీమింగ్ అవుతోంది. మూలకథ తెలుగులోనే రూపొందినప్పటికీ, తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లోనూ అందుబాటులో ఉంది. వారాంతంలో ఒక కొత్త తరహా థ్రిల్లింగ్ అనుభూతిని పొందాలనుకునే వారికి ఈ సినిమా ఒక సరైన ఎంపిక.

# ఒక ఆలోచన మూడేళ్ల నుంచి తినేస్తోంది..

ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ ఈ మధ్యన సినిమాలు, టీవీ షోస్ కంటే ఇతర విషయాలతో ఎక్కువగా వార్తల్లో నిలుస్తోంది. ఇటీవల సనాతన ధర్మం, హిందూ మతంపై ఈ స్టార్ నటి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారి తీశాయి. ప్రముఖ సినీ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించిన విషయాలను అన్నింటిలో ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేస్తుంటుంది. అలాగే సామాజిక అంశాలపైనా తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడిస్తుంటుంది. అయితే కొన్ని సార్లు అనసూయ కామెంట్స్ తీవ్ర వివాదానికి దారి తీస్తుంటాయి. ఇటీవల సనాతన ధర్మం, హిందూ మతంపై అనసూయ చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారి తీశాయి. సీనియర్ నటి హేమతో పాటు పలువురు అనసూయ కామెంట్స్ ను తప్పుపట్టారు. తాజాగా ఇన్ స్టాగ్రామ్ లో మరో ఆసక్తికరమైన వీడియో షేర్ చేసింది అనసూయ. అందులో అనాదిగా మహిళలపై కొనసాగుతున్న కొన్ని సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల గురించి పలు ప్రశ్నలు లేవనెత్తింది. భర్త చనిపోయిన తర్వాత మహిళలు బొట్టు, గాజులు, గజ్జెలు వంటి వాటిని ఎందుకు తీసేయాలంటూ ప్రశ్నించింది? ' గత మూడేళ్లుగా ఒక ఆలోచన నన్ను బాగా తినేస్తోంది. మూడేళ్ల క్రితం మా నాన్న చనిపోయారు. మా అమ్మ చాలా అందంగా ఉంటుంది. బొట్టు పెట్టుకుని, మంచి రంగు గాజులు, గజ్జెలు ధరించి చాలా అందంగా ముస్తాబు అయ్యేది. అయితే నాన్నగారు చనిపోయిన తర్వాత ఆ ఆడంబరాలన్నీ అమ్మకు దూరమయ్యాయి. మనకు బొట్టు, కాటుక, గాజులు, గజ్జెలు ఇవన్నీ ఎవరు పరిచయం చేశారు? మా అమ్మకు మా అమ్మమ్మ.. నాకు మా అమ్మ' 'అలాగే గోరింటాకు పెట్టుకోవడం, నెయిల్ పాలిష్ వేసుకోవడం వంటి వాటిని కూడా మనకు పెళ్లికి ముందే అమ్మలు, అమ్మమ్మలు పరిచయం చేసినవే. అలాంటప్పుడు వాటిని పెళ్లితో ఎందుకు ముడిపెట్టాలి? భర్త చనిపోగానే బొట్టు, గాజులు, గజ్జెలు వంటి వాటిని ఎందుకు తీసేయాలి? అలా అని ఎక్కడ రాసి ఉంది? ఒకవేళ ఇవన్నీ పెట్టుకోవద్దని అనుకుంటే.. అమ్మమ్మ చనిపోయినప్పుడే అమ్మ కూడా వాటిని మానేయాలి కదా. అది పర్సనల్ ఛాయిస్‌లా ఉండాలి. అన్నట్లు ఇది కేవలం నా ఆలోచన మాత్రమే. నేను ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడడం లేదు. ప్రతి ఒక్కరికీ తమకు నచ్చిన విధంగా జీవించే స్వేచ్ఛ ఉండాలి. ఒక మహిళ బొట్టు పెట్టుకోవాలా? వద్దా? గాజులు ధరించాలా? వద్దా? అనేది ఆమె వ్యక్తిగత నిర్ణయంగా ఉండాలి' అని అనసూయ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. అనసూయ కామెంట్స్ పై నెటిజన్లు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు.



# రిషబ్ పంత్ గాయంపై క్లారిటీ..

## జైస్వాల్ గొడవపై కోచ్ ఏమన్నారంటే..?



కొలంబో వేదికగా శ్రీలంకతో మొదలైన రెండో టెస్టు తొలిరోజే తీవ్ర ఉత్కంఠ రేపింది. భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ గాయపడి మైదానం వీడగా, యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ ప్రత్యర్థి బౌలర్‌తో వాగ్వాదానికి దిగాడు. ఈ పరిణామాలపై భారత బ్యాటింగ్ కోచ్ కీలక వివరాలు వెల్లడించారు. సింహలీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో ఆతిథ్య శ్రీలంకతో ప్రారంభమైన రెండో టెస్టులో భారత జట్టు మొదటి రోజు తన పట్టు నిరూపించుకుంది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా 5 వికెట్ల నష్టానికి 300 పరుగులు సాధించి పటిష్ట స్థితిలో నిలిచింది. జట్టు మంచి స్థితిలో ఉన్నప్పటికీ, స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ గాయపడటం డ్రెస్సింగ్ రూమ్‌లో టెన్షన్ పెంచింది. లంక ఫాస్ట్ బౌలర్ లాహిరు కుమార విసిరిన వేగవంతమైన బంతి నేరుగా పంత్ ఎడమ చేతి మణికట్టు కింద బలంగా తాకింది. తీవ్ర నొప్పితో విలవిల్లాడిన పంత్, కేవలం 3 పరుగులు మాత్రమే చేసి రిటైర్డ్ హర్ట్‌గా పెవిలియన్ చేరాల్సి వచ్చింది.

### పంత్ ఫిట్‌నెస్‌పై బ్యాటింగ్ కోచ్ భరోసా..

తొలి రోజు ఆట ముగిసిన అనంతరం భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ మీడియా ముందుకు వచ్చి పంత్ ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత ఇచ్చారు. పంత్ గాయం పెద్దది కాదని, అతడు ప్రస్తుతం కోలుకుంటున్నాడని చెప్పారు. రెండో రోజు ఆటలో పంత్ తిరిగి బ్యాటింగ్‌కు దిగే అవకాశం ఉందని స్పష్టం చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోరు సాధించాలంటే లోయరార్డర్‌లో పంత్ విలువైన ఇన్నింగ్స్ ఆడటం జట్టుకు ఎంతో అవసరం. ఈ ప్రకటనతో భారత అభిమానులు, జట్టు మేనేజ్‌మెంట్ ఊపిరి పీల్చుకున్నాయి.

### మైదానంలో జైస్వాల్ వర్సెస్ ఫెర్నాండో.. వేడెక్కిన వాతావరణం..

ఇన్నింగ్స్ 17వ ఓవర్ లో లంక పేసర్ అసిత ఫెర్నాండో బౌలింగ్‌లో జైస్వాల్ వరుసగా మూడు బౌండరీలు బాది జోరు చూపించాడు. అదే ఓవర్ చివరి బంతికి ఫెర్నాండో అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. వికెట్ తీసిన ఆనందంలో బౌలర్ దూకుడుగా సెండ్-ఆఫ్ ఇవ్వగా, జైస్వాల్ కూడా వెనక్కి తగ్గకుండా తీవ్ర ఆగ్రహంతో బౌలర్ వద్దకు వెళ్లి వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ వ్యవహారంపై కోచ్ కోటక్ స్పందిస్తూ.. మైదానంలో దూకుడు సహజమే అయినా, జైస్వాల్ సహనం కోల్పోయి బౌలర్ దగ్గరకు అంత దూరం వెళ్లాల్సింది కాదని హితవు పలికారు.

### మ్యాచ్ రెఫరీ నిర్ణయంపై ఉత్కంఠ..

శ్రీలంక బౌలింగ్ కోచ్ ర్యాన్ వాన్ నీకెర్క్ సైతం ఈ ఘటనపై మాట్లాడారు. ఆటలోని తీవ్రత కారణంగా భావోద్వేగాలు బయటకు వచ్చాయని, దీనిపై తుది నిర్ణయం మ్యాచ్ రెఫరీ ఆండీ పైక్రాఫ్ట్ చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. ఐసీసీ ప్రవర్తనా నియమావళి ప్రకారం మైదానంలో అనుచితంగా ప్రవర్తించినందుకు యశస్వి జైస్వాల్‌తో పాటు బౌలర్ అసిత ఫెర్నాండోపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొలంబో టెస్టు తొలిరోజు బ్యాటింగ్‌లో భారత్ ఆధిపత్యం ప్రదర్శించినా, పంత్ గాయం డ్రెస్సింగ్ రూమ్‌లో కాస్త కలవరం రేపింది. పంత్ రెండో రోజు మైదానంలోకి దిగడం ఖాయంగా కనిపిస్తుండగా, జైస్వాల్ వివాదంపై మ్యాచ్ రెఫరీ ఇచ్చే తీర్పు కీలకంగా మారనుంది.

క్రీడా వాయిస్
మీ క్రీడా వార్తల స్వరము

# ఐపీఎల్ కంటే ముందే భారత జట్టులోకి..

## అరుదైన జాబితాలో చేరిన మూడో ప్లేయర్ ఎవరంటే?



సాధారణంగా దేశవాళీలో రాణించాక ఐపీఎల్‌లో మెరిస్తేనే టీమిండియా తలుపులు తడతారు. కానీ కనీసం ఐపీఎల్ లీగ్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడని ఓ ఆటగాడు నేరుగా భారత టెస్టు జట్టులోకి వచ్చాడు. కొలంబో టెస్టు వేదికగా అరంగేట్రం చేసిన సారాంశ్ జైన్ ప్రయాణం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో సరికొత్త రికార్డును నెలకొల్పింది. శ్రీలంకతో కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో జరుగుతున్న రెండో టెస్టులో మధ్యప్రదేశ్ ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. దేశవాళీ క్రికెట్‌లో సుదీర్ఘ కాలంగా నిలకడగా రాణిస్తున్న ఈ ఆఫ్ స్పిన్ బౌలర్‌కు 33 ఏళ్ల వయసులో టీమిండియా తుది జట్టులో అవకాశం దక్కింది. 21వ శతాబ్దంలో భారత్ తరఫున అత్యంత పెద్ద వయసులో టెస్టుల్లో అరంగేట్రం చేసిన ఆటగాడిగా సారాంశ్ చరిత్రకెక్కాడు. అయితే అంతకంటే విశేషమేమిటంటే, ఇప్పటివరకు ఐపీఎల్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడని ఈ ఆటగాడు నేరుగా దేశం తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన క్రికెటర్ల జాబితాలో నిలిచాడు. 2024 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు నెట్ బౌలర్‌గా సేవలందించిన అనుభవం తప్ప, అతనికి ఐపీఎల్ క్యాప్ అందలేదు.

### నాడు మురళీ విజయ్.. దిల్లీలో మహమ్మద్ షమీ..

భారత క్రికెట్ చరిత్రలో ఐపీఎల్ కంటే ముందే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఆటగాళ్ల సంఖ్య చాలా తక్కువ. 2008లో ఆస్ట్రేలియాతో నాగ్‌పూర్‌లో జరిగిన టెస్టు మ్యాచ్‌తో భారత జట్టులోకి వచ్చిన మురళీ విజయ్ ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నాడు. గౌతమ్ గంభీర్ వివాదంతో ఒక మ్యాచ్ నిషేధానికి గురికావడంతో విజయ్‌కు ఆ అవకాశం వచ్చింది. ఆ తర్వాతి ఏడాదే అంటే 2009లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆయన ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఆ తర్వాత భారత స్టార్ పేసర్ మహమ్మద్ షమీ సైతం ఇదే బాటలో ప్రయాణించాడు. 2013 జనవరి 6న పాకిస్థాన్‌తో దిల్లీలో జరిగిన వన్డే ద్వారా షమీ మొదట టీమిండియాలోకి వచ్చాడు. అదే ఏడాది నవంబర్ 6న కోల్‌కతాలో వెస్టిండీస్‌పై టెస్టుల్లో రంగప్రవేశం చేశాడు. అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన కొన్ని నెలల తర్వాతే, 2013 ఏప్రిల్ 8న కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఆయన తన తొలి ఐపీఎల్ మ్యాచ్ బరిలోకి దిగాడు.

### ఫస్ట్ క్లాస్ రికార్డులే కొలంబో దాకా తీసుకొచ్చాయి..

లీగ్ క్రికెట్ మెరుపులు లేకపోయినా సంప్రదాయ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో చూపించిన నిలకడే సారాంశ్‌ను భారత జాతీయ జట్టులోకి నడిపించింది. ఇప్పటివరకు 54 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన ఆయన 3.01 ఎకానమీతో ఏకంగా 188 వికెట్లు పడగొట్టాడు. బౌలింగ్‌లోనే కాకుండా బ్యాటింగ్‌లోనూ కీలక సమయాల్లో రాణించాడు. 54 మ్యాచ్‌ల్లో 31.75 సగటు, 47.70 స్ట్రైక్ రేట్‌తో 2,223 పరుగులు సాధించి ఆల్‌రౌండర్‌గా తన విలువను చాటాడు. సంప్రదాయ క్రికెట్‌లో రికార్డులు బాగుంటే ఎలాంటి లీగ్ నేపథ్యం లేకపోయినా టెస్టు జట్టులో చోటు దక్కుతుందని సారాంశ్ ప్రయాణం మరోసారి స్పష్టం చేస్తోంది. వయసుతో సంబంధం లేకుండా దేశవాళీలో కష్టపడితే అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని సారాంశ్ జైన్ నిరూపించాడు. ఐపీఎల్ మెరుపులకు దూరంగా ఉంటూనే రెడ్ బాల్ క్రికెట్ ద్వారా తన కలను సాకారం చేసుకున్న ఈ ఆటగాడి అరంగేట్రం ప్రతి దేశవాళీ క్రికెటర్‌కు స్ఫూర్తిదాయకం.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com